# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 107 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | శనివారం 07 జూన్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 107 07-06-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-





ఛత్తీస్ గఢ్ లో నేడు కూడా కాల్పుల మోత...

మరో మావోయిస్టు అగ్రనేత మృతి



## త్వరలో నాకూ ప్రమోషన్ వస్తుందనుకుంటున్నా..

### ప్రధాని మోదీతో ఒమర్ అబ్దుల్లా

ప్రధాని మోదీ ఎదుట జమ్మకశ్మీర్ రాష్ట్ర హోదా అంశాన్ని లేవనెత్తిన ఒమర్ అబ్దుల్లా

గతంలో రాష్ట్ర సీఎంగా ఉండి, ఇప్పుడు కేంద్రపాలిత ప్రాంత సీఎంగా డిమోట్ అయ్యానన్న ఒమర్

రైల్వే సహాయ మంత్రిగా ఉన్న వ్యక్తి లెఫ్టినెంట్ గవర్నర్‌గా ప్రమోషన్ పొందారని ప్రస్తావన

త్వరలో తనకూ ప్రమోషన్ వస్తుందని ఆశిస్తున్నట్లు వ్యాఖ్య

చినాబ్ వంతెన ప్రారంభోత్సవ సభలో వ్యాఖ్యలు చేసిన ఒమర్ అబ్దుల్లా

న్యూఢిల్లీ జూన్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమక్షంలో రాష్ట్ర హోదా అంశాన్ని ప్రస్తావిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే తనకు కూడా ప్రధాని మోదీ పదోన్నతి కల్పిస్తారని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. శుక్రవారం జమ్ముకశ్మీర్ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ సమక్షంలో, చినాబ్ వంతెన ప్రారంభోత్సవ సభలో ఒమర్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రధాని మోదీని ఉద్దేశించి ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ, "2014లో మీరు ఇక్కడికి వచ్చినప్పుడు నేను రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నాను. కానీ ఇప్పుడు, ఒక కేంద్రపాలిత ప్రాంత ముఖ్యమంత్రిగా

- తరువాయి 2లో..

# ఉగ్ర కుట్రలను సాగనివ్వం..

- కశ్మీర్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర హెచ్చరిక
- శ్రీనగర్‌లో చారిత్రక చినాబ్ వంతెనను ప్రారంభించిన ప్రధాని మోదీ
- ఎన్ని కుట్రలు చేసినా కశ్మీర్ అభివృద్ధి ఆగదని స్పష్టం
- పహల్గామ్ దాడి, ఆపరేషన్ సిందూర్‌ను ప్రస్తావించిన ప్రధాని
- ఉగ్రవాదానికి ఊతమిస్తున్న పాకిస్థాన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు
- భారత రైల్వే నెట్‌వర్క్‌తో కశ్మీర్‌కు అధికారికంగా అనుసంధానం

న్యూఢిల్లీ జూన్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

జమ్ముకశ్మీర్ అభివృద్ధి ప్రస్థానంలో చినాబ్ నదిపై నిర్మించిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే వంతెన ఒక కీలక మైలురాయి అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా, కుట్రలు పన్నినా కశ్మీర్‌లో ప్రగతిని ఎవరూ నిలువరించలేరని ఆయన స్పష్టం చేశారు. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం తొలిసారిగా కశ్మీర్ లోయలో పర్యటించిన ప్రధాని, శుక్రవారం ఈ ప్రతిష్ఠాత్మక వంతెనను జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ, పహల్గామ్ దాడి ఘటనను, ఉగ్రవాదులకు బుద్ధి చెప్పిన 'ఆపరేషన్ సిందూర్'ను ఆయన గుర్తుచేశారు. "మన పొరుగున ఉన్న దేశం పర్యాటకానికి, మానవత్వానికి శత్రువులా వ్యవహరిస్తోంది. ఇక్కడి పర్యాటకాన్ని దెబ్బతీసి, పేదల జీవనోపాధిని దెబ్బతీయాలని చూస్తోంది" అని ప్రధాని అన్నారు. పహల్గామ్ దాడిలో ఉగ్రవాదులతో వీరోచితంగా పోరాడి ప్రాణాలు కోల్పోయిన ఆదిల్ హుస్సేన్ అనే పోనీవాలాను ఆయన స్మరించుకున్నారు. "కుటుంబ పోషణ కోసం కష్టపడే ఆదిల్ హుస్సేన్‌ను కూడా ఉగ్రవాదులు పొట్టనబెట్టుకున్నారు. ఉగ్రవాదంపై మా పోరాటం ఆగదు. పాకిస్థాన్ కుయుక్తులను భారత్ ఎప్పటికప్పుడు తిప్పికొడుతూనే ఉంది. ఉగ్ర కుట్రలకు మేం దీటుగా సమాధానమిస్తున్నాం" అని మోదీ తెలిపారు. "కశ్మీర్‌లో పర్యాటకాన్ని నాశనం చేయాలనే దురుద్దేశంతో, దేశంలో అలజడి సృష్టించాలనే లక్ష్యంతోనే పహల్గాంలో ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. అమాయకుల ప్రాణాలు తీశారు. దీనికి ప్రతీకారంగానే 'ఆపరేషన్ సిందూర్' ద్వారా మన సత్తా ఏంటో చూపించాం. సరిగ్గా నెల రోజుల క్రితం పొరుగు దేశంలోని ఉగ్ర స్థావరాలను మన బలగాలు నేలమట్టం చేశాయి. పాక్ నాయకత్వానికి కంటిమీద కునుకు లేకుండా చేశాం. ఎన్ని కుట్రలు చేసినా కశ్మీర్ అభివృద్ధిని అడ్డుకోలేరు" అని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు.

**ఇంజినీరింగ్ అద్భుతం చినాబ్ వంతెన**



"ఈఫిల్ టవర్ కంటే ఎత్తైన చినాబ్ వంతెనను మనం నిర్మించుకున్నాం. ఇది భారత ఇంజినీరింగ్ నైపుణ్యానికి, సంకల్పానికి ప్రతీక" అని ప్రధాని కొనియాడారు. ఈ వంతెన నిర్మాణంతో ఈ ప్రాంతం ఒక ప్రధాన పర్యాటక ఆకర్షణగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. "ఈ వంతెన నిర్మాణంలో అనేక సవాళ్లు ఎదురయ్యాయి. అయినప్పటికీ, మాతా వైష్ణోదేవి ఆశీస్సులతో ఇది సాధ్యమైంది. ఈ రోజుతో కశ్మీర్ కూడా భారత రైల్వే

- తరువాయి 2లో..





# 8 జిల్లాలతో విశాఖ ఎకనమిక్ రీజియన్



- మూలపేట - కాకినాడ మధ్య బీచ్ రహదారి అభివృద్ధి
- మరో ముంబైలా విశాఖ
- నీతి ఆయోగ్‌తో సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి జూన్ 07 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

'విశాఖ ఎకనమిక్ రీజియన్'ను ఆంధ్రప్రదేశ్‌కు గ్రోత్ ఇంజిన్‌గా తీర్చిదిద్దాలని, 2032 నాటికి 120 బిలియన్ డాలర్ల సంపద సృష్టి ఈ రీజియన్ నుంచి జరగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. వచ్చే ఏడేళ్లలో విశాఖను మరో ముంబై నగరంలా తీర్చిదిద్దాలని నిర్దేశించారు. విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్ పరిధిలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, ఏఎస్ఆర్, మన్యం.. మొత్తం 8 జిల్లాల పరిధిలో ఎకనమిక్ యాక్టివిటీ పెరిగేలా ప్రాజెక్టులు

- తరువాయి 2లో..

### శ్రీ సత్యసాయి జిల్లాలో

# కేంద్ర ఆర్థిక మంత్రి పర్యటన



శ్రీసత్యసాయి జిల్లా, జూన్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సత్యసాయి జిల్లాలో పర్యటిస్తున్నారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రికి రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ స్వాగతం పలికారు. శుక్రవారం శ్రీ సత్యసాయి జిల్లా పాలసముద్రం వద్దనున్న నాసిన్ కేంద్రంలో నిర్వహించే పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కేంద్ర మంత్రి కావడం జరిగింది. ఈసందర్భంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కు, రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవితమ్మ, ఎంపీ బి.కె. పార్థసారథి మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛంను అందజేసి ఘన స్వాగతం పలికారు.

## ఏఐలో నైపుణ్య శిక్షణ కోసం 'ఎన్ విడియా'తో ఏపీ ప్రభుత్వం కీలక ఒప్పందం

ఏఐలో ఏపీని అగ్రగామిగా నిలిపేందుకు మంత్రి నారా లోకేశ్ కృషి

ఏఐ వర్సిటీ దిశగా కీలక అడుగులు

నేడు నారా లోకేశ్ సమక్షంలో కీలక ఒప్పందం





అమరావతి జూన్ 07 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

దేశంలోనే ఏఐ ఆధారిత పరిశోధన, నవీన ఆవిష్కరణలు, నైపుణ్య అభివృద్ధిలో రాష్ట్రాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ) యూనివర్సిటీ ఏర్పాటుకు

- తరువాయి 2లో..

# మెగా డిఎస్సీ పరీక్షలు ప్రారంభం

### ఆల్ ది బెస్ట్ చెప్పిన చంద్రబాబు

విజయవాడ జూన్ 07 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



విజయవాడ – ఏపీలో మెగా డీఎస్సీ 2025 పరీక్షలు నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. మొత్తం 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఈ నియామక ప్రక్రియ చేపట్టారు. ఈ పరీక్షలు కంప్యూటర్ ఆధారిత విధానంలో జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు పరీక్షలకు హాజరవుతున్న డీఎస్సీ అభ్యర్థులకు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ మేరకు "AP DSC 2025 ఉపాధ్యాయ నియామక పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు శుభాకాంక్షలు!" అంటూ ఆయన ట్వీట్ చేశారు. అలాగే మంత్రి నారా లోకేష్ కూడా అభ్యర్థులకు శుభకాంక్షలు తెలిపారు. ఇక, ఈ రోజు ప్రారంభమైన ఈ పరీక్షలు ఈ నెల 30 తేదీ వరకు కొనసాగుతాయి. ఈ మెగా డీఎస్సీ కోసం రాష్ట్రవ్యాప్తంగా 137, ఇతర రాష్ట్రాల్లో 17 మొత్తం 154 పరీక్షా కేంద్రాల్లో ప్రతిరోజూ రెండు షిఫ్టులలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉదయం షిఫ్టు 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు, మధ్యాహ్నం షిఫ్టు 2:30 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు జరుగుతుందని అధికారులు

- తరువాయి 2లో..

## సంపాదకీయం

# సందేహాస్పద బనకచర్ల

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చీ రాగానే ఆకాశమే హద్దుగా హైప్ ఇచ్చి తలకెత్తుకున్న గోదావరి-బనకచర్ల భారీ నీటి పారుదల ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలపై ఆదిలోనే సందేహాలు చుట్టుముట్టాయి. రూ. 81 వేల కోట్ల వ్యయం కాగల ఈ 'బాహుబలి' ప్రాజెక్టును స్వీయ ఆర్థిక (సెల్ఫ్ ఫైనాన్స్) ప్రాజెక్టుగా కేంద్ర ఆర్థిక శాఖ వద్ద రెండు రోజుల క్రితం జరిగిన సమావేశంలో రాష్ట్ర అధికారులు పేర్కొన్నట్లు వార్తలొచ్చాయి. సెల్ఫ్ ఫైనాన్స్ అంటే ఏమిటి? ఎలా అమలు చేస్తారు? ప్రజలపై ఏమైనా భారాలు మోదుతారా? అనే విషయాలను ప్రభుత్వం బహిర్గతం చేస్తేనే ఎవ్వరికైనా అవగతమవుతుంది. వెల్లడించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. గత డిసెంబర్‌లో బనకచర్ల ప్రాజెక్టును ముందుకు తెచ్చిన సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రైవేటు కంపెనీలను భాగస్వామ్యం చేస్తామన్నారు. మొన్న కేంద్రం వద్ద జరిగిన సమావేశంలో నిధుల సమీకరణపై మన అధికారులు ఇచ్చిన ప్రజంటేషన్‌లో కేంద్ర సాయం, రాష్ట్రం నిధులు, కొంత అప్పు, యాన్యుటీ నమూనాలో పని చేసే కాంట్రాక్టర్లు కొంత వెచ్చిస్తారని చూచాయగా చెప్పారు. పూర్తి నిధులు కేంద్రాన్ని అడగకుండా అప్పులు, కాంట్రాక్టర్ల నుంచి డబ్బు సమీకరిస్తామనడంతోనే ప్రైవేటు ప్రాజెక్టుగా అనిపిస్తుంది. అదే అయితే నీటి వినియోగదారులపై పన్నుల బాదుడు అనివార్యం.

పోలవరం నుంచి 200 టిఎంసి గోదావరి వరద నీటిని కర్నూలు జిల్లా బనకచర్ల రెగ్యులేటర్ తరలించే గోదావరి-కృష్ణా-పెన్నా నదులను అనుసంధానం చేసే ప్రాజెక్టు వలన వెనకబడిన రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని 80 లక్షల మంది తాగునీటి అవసరాలకు, కొత్తగా ఏడున్నర లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుందంటోంది ప్రభుత్వం. ఆ లక్ష్యం నెరవేరితే మంచిదే. ప్రభుత్వ చిత్తశుద్ధి, ఆచరణపైనే అనుమానం. ఇప్పటికే ఉన్న పోలవరం అనుభవం ప్రభుత్వ కార్యదక్షతను వెక్కిరిస్తోంది. రాష్ట్ర విభజన చట్టంలో పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా పేర్కొనగా దశాబ్దం దాటినా అతీగతీ లేదు. ఈ కాలమంతా కేంద్రంలో బిజెపి ప్రభుత్వమే అధికారంలో ఉంది. నిర్వాసితుల బాధ్యత తమది కాదని తప్పించుకుంటోంది. తమది కూటమి ప్రభుత్వమని, డబుల్ ఇంజన్ సర్కార్ అని అటు బిజెపి ఇటు టిడిపి, జనసేన చెప్పుకుంటున్నా పోలవరంపై అగమ్యగోచరమే. రూ.15 వేల కోట్ల అంచనాతో మొదలైన పోలవరం ఇప్పుడు 55 వేల కోట్లకు చేరుకుంది. భవిష్యత్తేమిటో తెలీదు. ఈ పూర్వరంగంలో డిపిఆర్, ప్రీ ఫీజిబిలిటీ నివేదికలు సైతం లేని బనకచర్ల పరిస్థితిని ఊహించడం కష్టం. కేంద్రాన్ని నిధులడగకుండా బనకచర్లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు యోచన అప్పుల కోసమే. అప్పులిచ్చే వారు ప్రాజెక్టుపై ఎంత రిటర్న్ వస్తాయో తెలుసుకున్నాకనే రుణాలిస్తారు. ప్రజలపై పన్నులేస్తేనే ఆదాయం వస్తుంది.

ఆంధ్రప్రదేశ్‌కు వ్యవసాయమే ఆధారం. సాగునీటి ప్రాజెక్టులతోనే సాగుకు గ్యారంటీ. రాష్ట్రంలో సాగయ్యే భూమిలో అన్ని నీటి వనరులూ కలుపుకున్నా 40 శాతం విస్తీర్ణానికే సాగునీటి వసతి ఉంది. ప్రభుత్వాలు కనబరిచిన చిన్ననీటి వనరుల నిర్లక్ష్యం వలన వాటి పరిధిలో అంతకంతకూ సాగు తగ్గుతోంది. ప్రాజెక్టులు కడుతున్నామని ఏలికలు ప్రచారం చేసుకుంటుండగా కాల్వల కింద సాగు పెరిగింది లేదు. క్రమేపి తగ్గుతోంది. రాష్ట్ర విభజన జరిగిన 2014లో కాల్వల కింద సాగు 18.82 లక్షల హెక్టార్లు కాగా నేడు 13.24 లక్షల హెక్టార్లకు క్షీణించింది. టిడిపి, వైసిపి రెండు ప్రభుత్వాల్లోనూ క్షీణత కొనసాగింది. బనకచర్ల వంటి బాహుబలి స్కీంలను చూపించి ఇతర ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తారన్న ఆందోళన ప్రజల్లో నెలకొంది. వెనుకబడ్డ రాయలసీమ, ఇతర కరువు పీడిత ప్రాంతాల్లో ప్రాధాన్యత కలిగి ఇప్పటికే చేపట్టిన తెలుగుగంగ, హంద్రీ-నీవా, గాలేరు-నగరి, వెలుగొండ ఇత్యాది ప్రాజెక్టులకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించి పూర్తి చేయాలన్న డిమాండ్ సహేతుకమైనది. ప్రతిపాదిత బనకచర్ల వలన ఆయా ప్రాజెక్టులకు కృష్ణా ట్రిబ్యునల్స్ ద్వారా ఉమ్మడి రాష్ట్రంలో కల్పించిన హక్కులకు భంగం వాటిల్లుతుందన్న ఆవేదనకు ప్రభుత్వం నుంచి సమాధానం లేదు. తెలంగాణ ప్రభుత్వం బనకచర్లను తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ తరుణంలో కూటమి ప్రభుత్వం నేల విడిచి సాము చేసే విన్యాసాలను విడనాడి రాష్ట్ర, వెనకబడ్డ ప్రాంతాల ప్రజల ప్రయోజనాలకు కట్టుబడాలి. ఆ దిశగా ప్రజలే ప్రభుత్వాన్ని కదిలించాలి.

# ఛత్తీస్ గఢ్‌లో నేడు కూడా కాల్పుల మోత...

## మరో మావోయిస్టు అగ్రనేత మృతి

**ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లాలో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య కాల్పులు**
**తెలంగాణ మావోయిస్టు నేత మైలారపు ఆదెల్లు అలియాస్ భాస్కర్ మృతి**
**భాస్కర్ తలపై రూ.25 లక్షల రివార్డు ఉన్నట్టు ప్రకటన**
**మృతుడు ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం పొచరా వాసి**
**ఘటనా స్థలంలో ఏకే-47 తుపాకీ స్వాధీనం**



గత కొన్ని రోజులుగా మావోయిస్టులకు వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఇటీవల కాలంలో జరిగిన ఎన్ కౌంటర్లలో మావోయిస్టు అగ్రనేతలు మృతి చెందడం తెలిసిందే. తాజాగా మరో మావోయిస్టు అగ్రనేత హతమయ్యారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా అటవీ ప్రాంతంలో శుక్రవారం భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య తీవ్రస్థాయిలో ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో మావోయిస్టు పార్టీకి చెందిన కీలక నేత, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు మైలారపు ఆదెల్లు అలియాస్ భాస్కర్ (45) మృతి చెందినట్లు అధికారులు ధృవీకరించారు. మృతుడు భాస్కర్ స్వస్థలం తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మండలం పరిధిలోని పొచరా గ్రామంగా గుర్తించారు. వివరాల్లోకి వెళితే, బీజాపూర్ జిల్లాలోని నేషనల్ పార్క్ సమీపంలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారన్న పక్కా సమాచారంతో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ), స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్), కోబ్రా (కమెండో బెటాలియన్ ఫర్ రెజల్యూట్ యాక్షన్) దళాలు సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో భద్రతా బలగాలకు తారసపడిన మావోయిస్టులు కాల్పులకు దిగారు. అప్రమత్తమైన భద్రతా దళాలు ఎదురుకాల్పులు జరపడంతో ఇరువర్గాల మధ్య కొంతసేపు భీకర పోరు నడిచింది. కాల్పులు ముగిసిన అనంతరం ఘటనా స్థలంలో భద్రతా బలగాలు గాలింపు చర్యలు చేపట్టగా, ఒక మావోయిస్టు మృతదేహాన్ని గుర్తించారు. మృతుడిని తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు మైలారపు ఆదెల్లు అలియాస్ భాస్కర్‌గా నిర్ధారించారు. భాస్కర్ తలపై రూ.25 లక్షల రివార్డు ఉందని అధికారులు వెల్లడించారు. ఘటనా స్థలం నుంచి ఒక ఏకే-47 రైఫిల్‌ను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ఆపరేషన్‌తో మావోయిస్టు పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లయింది. ఆ ప్రాంతంలో ఇంకా మావోయిస్టులు ఉండే అవకాశం ఉండటంతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు వివరించారు.

## త్వరలో నాకూ ప్రమోషన్

# వస్తుందనుకుంటున్నా..

నేను డిమోట్ అయ్యాను. అప్పట్లో రైల్వేశాఖ సహాయమంత్రిగా ఉన్న వ్యక్తికి (ప్రస్తుత లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాను ఉద్దేశిస్తూ) లెఫ్టినెంట్ గవర్నర్‌గా పదోన్నతి లభించింది. త్వరలోనే నాకూ పదోన్నతి లభిస్తుందని ఆశిస్తున్నాను. దీన్ని సరిదిద్దడానికి ఎక్కువ సమయం పట్టదని నేను భావిస్తున్నాను" అని అన్నారు. ప్రస్తుతం జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా మనోజ్ సిన్హా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఒమర్ అబ్దుల్లా 2009 నుంచి 2014 వరకు, జమ్ముకశ్మీర్ పూర్తిస్థాయి రాష్ట్రంగా ఉన్నప్పుడు ముఖ్యమంత్రిగా పనిచేశారు. అయితే, 2019లో కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370ని రద్దు చేసి, జమ్ముకశ్మీర్ రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించిన విషయం తెలిసిందే. జమ్ముకశ్మీర్‌లో గత ఏడాది జరిగిన ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ)-కాంగ్రెస్ కూటమి విజయం సాధించడంతో, కేంద్రపాలిత ప్రాంతంగా మారిన జమ్ముకశ్మీర్‌కు ఒమర్ అబ్దుల్లా తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి ఆయన రాష్ట్ర హోదా పునరుద్ధరణ కోసం డిమాండ్ చేస్తూనే ఉన్నారు.

# ఉగ్ర కుట్రలను సాగనివ్వం..

నెట్‌వర్క్‌తో పూర్తిగా అనుసంధానమైంది. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు రైలు ప్రయాణం అనేది ఇప్పుడు వాస్తవరూపం దాల్చింది. ఈ రోజు కోసం ఎన్నో తరాలు ఎదురుచూశాయి" అని ప్రధాని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఓ ఆసక్తికర విషయాన్ని ప్రధాని పంచుకున్నారు. "సీఎం ఒమర్ అబ్దుల్లా గారు 8వ తరగతి చదువుతున్నప్పటి నుంచే ఈ ప్రాజెక్ట్ గురించి కలలు కన్నారు. ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం ఆ కలను నెరవేర్చింది" అని మోదీ తెలిపారు. ఈ వంతెన ప్రారంభోత్సవం కశ్మీర్ అభివృద్ధిలో నవశకానికి నాంది పలుకుతుందని ఆయన అన్నారు.

# 8 జిల్లాలతో విశాఖ ఎకనమిక్ రీజియన్

నెలకొల్పాలన్నారు. 8 జిల్లాల్లో వివిధ ప్రాజెక్టుల కోసం లక్ష ఎకరాలు గుర్తించాలని అధికారులను ఆదేశించారు. 36 వేల చదరపు కిలో మీటర్ల విస్తీర్ణం, 15.5 మిలియన్ జనాభా కలిగివున్న విశాఖ రీజియన్‌లో ప్రస్తుతం 49 బిలియన్ డాలర్ల జీడీడీపీ నమోదవుతోందని, 2032 నాటికి 20 నుంచి 24 లక్షల మేర ఉద్యోగాలు పెరిగేందుకు అవకాశం ఉండటంతో ఈ ప్రాంతం రాష్ట్ర పురోగతిలో కీలకం కానుందన్నారు. శుక్రవారం సచివాలయంలో జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో 'విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్'గా అభివృద్ధి చేసే అంశంపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. 6 పోర్టులు, 7 మాన్యుఫాక్చరింగ్ నోడ్లు, 17 మేజర్ వ్యవసాయ క్షేత్రాలు, 6 సర్వీస్ హబ్స్, 12 పర్యాటక హబ్స్‌తో విశాఖ ఎకనమిక్ రీజియన్‌ను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. దీనిపై నీతి ఆయోగ్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. పోర్టు, ఐటీ, వ్యవసాయం, పర్యాటకం, హెల్త్ కేర్, పట్టణీకరణ, మౌలికవసతుల కల్పన... ఇలా 7 గ్రోత్ డ్రైవర్లుగా రూపొందించిన ప్రణాళికలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇందుకోసం అత్యంత ప్రాధాన్యమైన 41 ప్రాజెక్టులను చేపట్టాల్సి ఉందన్నారు. విశాఖ ఎకనమిక్ రీజియన్ ప్రణాళికలు అమలు చేయగలిగితే వచ్చే 7 ఏళ్లలో 7.5 లక్షల గృహాలు, 10,000 హోటల్ రూములు, 20 వరకు ఇన్నోవేషన్ సెంటర్లు, 10 కాలేజీలు, 7,000 ఆస్పత్రి బెడ్స్, 20,000 హెక్టార్ల పరిధిలో పరిశ్రమలు, 80 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో కార్యాలయ సముదాయం, 60 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో గోదాములు అదనంగా సమకూరతాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. "మూలపేట-విశాఖపట్నం, విశాఖపట్నం-కాకినాడ మధ్య బీచ్ రహదారులు నిర్మిస్తాం. వీటిని జాతీయ రహదారులతో అనుసంధానం చేస్తాం. సముద్ర తీరం సంపద నిలయం దానిని మరింత వినియోగించుకునేలా చూడాలి. పర్యాటకాన్ని పరిశ్రమగా గుర్తించాం, నూతన పాలసీ పెట్టుబడిదారులకు ఎంతో అనుకూలం. భవిష్యత్ అవసరాల దృష్ట్యా యువతకు నిరంతరాయంగా నైపుణ్య శిక్షణ అందిస్తాం. వర్క్ ఫ్రమ్ హోమ్ - నాలెడ్జ్ ఎకానమి అవుట్ సోర్సింగ్ విధానాలు అవలంభిస్తున్నాం. వర్క్ ఫ్రమ్ హోమ్ కింద 20 లక్షల మందికి అవకాశం కల్పించాలని ప్రయత్నిస్తున్నాం" అని ముఖ్యమంత్రి అన్నారు. దేశంలోని టాప్- 3 స్టీల్ పరిశ్రమలతో స్టీల్ హబ్‌గా తీర్చిదిద్దడం... అలాగే పెట్రో కెమికల్స్, గ్యాస్ గ్రిడ్, పోర్టుల అభివృద్ధి, పెట్రోకెమికల్స్- మెడికల్ టెక్, షిప్ బిల్డింగ్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్, క్లీన్ టెక్, లేబర్ ఇంటెన్సివ్ మాన్యుఫాక్చరింగ్‌పై దృష్టి పెట్టాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. వచ్చే 7 ఏళ్లలో ఐటీ రంగంలో కనీసం 4 నుంచి 5 లక్షల ఉద్యోగాల కల్పన జరిగేలా లక్ష్యంగా పేర్కొన్నారు. డేటా సెంటర్లు, స్టార్టప్‌లు-ఇన్నోవేషన్ సెంటర్లు ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. ప్రస్తుతం కొనసాగుతున్న 4 రైల్వే ప్రాజెక్టులతో పాటు అదనంగా 2032 కల్లా మరో 7 కొత్త రైల్వే ప్రాజెక్టులు పూర్తి చేయడం, మాన్యుఫాక్చరింగ్ నోడ్స్, పోర్టులకు అనుకూలించేలా కొత్తగా 9 రోడ్డు ప్రాజెక్టులు చేపట్టడం, 2028-30 కల్లా 77 కి.మీ. మేర నిర్మించే వైజాగ్ మెట్రో ప్రాజెక్టుపై చర్చించారు.

### ఏపీ విద్యుత్ సంస్కరణలు దేశానికే ఆదర్శం

"1998లో విద్యుత్ సంస్కరణలు దేశంలోనే తొలిసారిగా తీసుకువచ్చాం. 2014లో రెన్యువబుల్ ఎనర్జీకి ప్రాధాన్యత ఇచ్చాం. ఇప్పుడు అదే అత్యంత చవకైన విద్యుత్ ఉత్పత్తికి అవకాశం కల్పించింది. టెక్నాలజీ పరిధి పెరిగింది. దీనిని విద్యుత్ రంగంలో వినియోగించే అద్భుతాలు సాధించాం. ఇప్పుడు ప్రజలే ఉత్పత్తిదారులు-వినియోగదారులుగా చేసేలా నూతన విధానాలు అమలు చేస్తున్నాం. ఎవరి విద్యుత్ వాళ్లే ఉత్పత్తి చేసుకుంటే విద్యుత్ సరఫరా నష్టాలు అనేవి ఉండవు. ఈవీ వాహనాలకు అందరూ మళ్లితే రవాణా ఖర్చులు కూడా పూర్తిగా తగ్గిపోతాయి. సోలార్, విండ్ పవర్‌తో పాటు పంప్డ్ ఎనర్జీ, బ్యాటరీ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి ప్రాధాన్యత ఇస్తున్నాం. ఇందుకుతగ్గ వనరులు రాష్ట్రంలో పుష్కలంగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ ఆశయం నెరవేరేందుకు నీతి ఆయోగ్ సహకారం కూడా కోరుతున్నాను"అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎనర్జీ ట్రాన్సిషన్ రోడ్ మ్యాప్‌పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - నీతి ఆయోగ్, ఐఎస్‌ఈజీ ఫౌండేషన్ మధ్య ముఖ్యమంత్రి సమక్షంలో అవగాహనా ఒప్పందం కుదిరింది. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 27.3 గిగావాట్లుగా ఉంది. రాష్ట్రంలో 2019లో 55.6 బిలియన్ యూనిట్లుగా ఉన్న విద్యుత్ డిమాండ్ 2025 నాటికి 69.7 బి.యూ.కు చేరింది. ఇందులో పరిశ్రమలో రంగంలో 4.8 శాతం, గృహ వినియోగానికి 5.1 శాతం మేర డిమాండ్ పెరిగింది. వచ్చే ఏడాదికి రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 88.6 బి.యూ నుంచి 2035 నాటికి 163.9 బి.యూ. కు చేరుకోనుంది. ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ కింద 2029 నాటికి 78.50 గిగావాట్ల సోలార్ విద్యుత్, 35 గిగావాట్ల విండ్, పంప్డ్ స్టోరేజ్ 22 గిగావాట్లు, గ్రీన్ హైడ్రోజన్ 1.50 ఎంఎంపీటీఏ, బ్యాటరీ స్టోరేజ్ 25 గిగావాట్లు, ఇథనాల్ 1,500 కెఎల్‌పీడీ, 5,000 ఈవీ చార్జింగ్ స్టేషన్లు, 10,000 టీపీడీ బయో సీఎన్జీ-సీబీజీ లక్ష్యంగా నిర్ణయించారు. క్లీన్ ఎనర్జీ రంగంలో రాష్ట్రానికి ఇప్పటిదాకా రూ.5.78 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. దీంతో 57.7 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కానుంది. ఈ సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రమణ్యం, సీఎస్ విజయానంద్, ఐఎస్‌ఈజీ ఫౌండేషన్ ప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఏఐలో నైపుణ్య శిక్షణ కోసం 'ఎన్ విడియా'తో ఏపీ ప్రభుత్వం కీలక ఒప్పందం

కూటమి ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఏఐలో యువతకు నైపుణ్య శిక్షణ సహా ఏఐ యూనివర్శిటీ ఏర్పాటుకు సహకరించేలా ప్రపంచ ప్రఖ్యాత ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ) కంప్యూటింగ్ సంస్థ "ఎన్ విడియా(%చీ×ఱ¤ఱూ%)"తో రాష్ట్ర ప్రభుత్వం కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఉన్నత విద్య అధికారులు, ఎన్ విడియా(%చీ×ఱ¤ఱూ%) ప్రతినిధులు అవగాహన ఒప్పందం చేసుకున్నారు. ఈ ఒప్పందం ద్వారా 10వేల మంది విద్యార్థులకు ఏఐలో నైపుణ్య శిక్షణ అందించనున్నారు. దీంతో పాటు 500 ఏఐ ఆధారిత స్టార్టప్ ల అభివృద్ధికి మద్దతు ఇవ్వనున్నారు. గతేడాది అక్టోబర్ లో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్.. ఎన్ విడియా సీఈవో జెన్సన్ హువాంగ్ తో ముంబైలో సమావేశం అయ్యారు. అమరావతిలో ఏర్పాటుచేయబోయే ఏఐ యూనివర్సిటీకి సహకరించాల్సిందిగా కోరారు. ఇందుకు హువాంగ్ సానుకూలంగా స్పందించారు. ఈ నేపథ్యంలో ఎన్ విడియాతో ప్రభుత్వం కీలక ఒప్పందం కుదుర్చుకుంది.

**ఆంధ్రప్రదేశ్ ను ఏఐ పరిశోధనల కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం**

ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రముఖ ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యాలతో రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులకు ఆధునిక ఏఐ నైపుణ్యాలను అందించనున్నారు. రాబోయే సంవత్సరాల్లో 10 వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం, 500 ఏఐ ఆధారిత స్టార్టప్‌ల అభివృద్ధికి మద్దతు ఇవ్వడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏఐ యూనివర్శిటీకి అత్యాధునిక కంప్యూటింగ్ వనరులు, సాఫ్ట్‌వేర్ ప్లాట్‌ఫామ్ లు, హార్డ్‌వేర్ సామర్థ్యాలను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. పరిశ్రమలు, ప్రభుత్వం, విద్యా రంగం మధ్య బలమైన భాగస్వామ్యానికి ఈ ఒప్పందం వేదికగా మారనుంది. విద్యార్థులకు ప్రాజెక్టులు, పరిశోధన, మార్కెట్ అవకాశాలు, మెంటార్‌షిప్ వంటి అనేక అవకాశాలను కల్పించనున్నారు. ముఖ్యంగా ఏఐ, స్టార్టప్‌ల అభివృద్ధికి ఇది బలమైన వేదికగా నిలవనుంది. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అడ్వాన్స్‌డ్ ఏఐ రీసెర్చ్ హబ్‌గా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ లక్ష్యానికి ఈ ఒప్పందం కీలకమైన ముందడుగు కానుంది. ఈ కార్యక్రమంలో 'ఎన్ విడియా(%చీ×ఱ¤ఱూ%)' సౌత్ ఏసియా ఎండీ విశాల్ దూపర్, స్ట్రాటజిక్ బిజినెస్ డైరెక్టర్ గణేశ్ మహాబల, ఏవీపీ ప్రైమస్ పార్ట్ నర్ సుమన్ కసానా, విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, ఏపీఎస్ హెచ్ఈ ఛైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# మెగా డీఎస్సీ పరీక్షలు ప్రారంభం

తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం అధికారులు కఠినమైన మార్గదర్శకాలను జారీ చేశారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమని డీఎస్సీ కన్వీనర్ వెంకట కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. అభ్యర్థులు సమయపాలన పాటించాలని, పరీక్షా నిబంధనలను ఖచ్చితంగా అనుసరించాలని ఆయన సూచించారు. కొంతమంది అభ్యర్థుల హాల్ టికెట్లపై ఫోటోలు లేని కారణంగా, అలాంటి వారు తమ వెంట రెండు తాజా పాస్‌పోర్ట్ సైజు ఫోటోలను తీసుకురావాలని అధికారులు తెలిపారు. అలాగే హాల్ టికెట్లలో ఏవైనా తప్పులు ఉంటే, అభ్యర్థులు తమ వెంట ఆధార్ కార్డు, పాన్ కార్డు లేదా ఓటర్ ఐడీ వంటి ప్రభుత్వ గుర్తింపు కార్డులను తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.

# రాజ్యసభకు కమల్ హాసన్ నామినేషన్

**తమిళనాడు : మక్కల్ నీది మయ్యం పార్టీ అధినేత, ప్రముఖ నటుడు కమల్ హాసన్ రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ కార్యక్రమానికి తమిళనాడు సీఎం ఎంకే. స్టాలిన్, మంత్రి ఉదయ నిధి స్టాలిన్ హాజరయ్యారు. ఇటీవల తన చిత్రం 'థగ్ లైఫ్' ఈవెంట్‌లో కన్నడ భాషపై ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. దాంతో బుధవారం వేయాల్సిన రాజ్యసభ నామినేషన్‌ను కమల్ వాయిదా వేసుకున్నారు. సినిమా వ్యవహారాలు పూర్తయిన తర్వాతే నామినేషన్ వేయాలని భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. థగ్ లైఫ్ చిత్రం గురువారం విడుదలవడంతో నేడు నామినేషన్ దాఖలు చేశారు. కమల్‌తో పాటు మరో ముగ్గురు డీఎంకే నేతలు రాజ్యసభకు నామినేషన్ వేశారు.**




కమల్ 2018లో ఎంఎన్ఎం పార్టీని స్థాపించారు. విపక్ష ఇండియా కూటమిలో ఇది భాగం. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తమిళనాడులో డీఎంకే, కాంగ్రెస్ కూటమికి మద్దతు ప్రకటించింది. ఇందుకుగాను చేసుకున్న ఒప్పందంలో భాగంగా రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలు, పుదుచ్చేరిలోని ఒక స్థానంలో ఎంఎన్ఎం ప్రచారం చేసింది. దీంతో 2025 ఎగువసభ ఎన్నికల్లో ఎంఎన్ఎం పార్టీకి రాజ్యసభ స్థానం ఇచ్చేందుకు డీఎంకే నేతృత్వంలోని కూటమి అంగీకరించింది. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో డీఎంకేతో కుదిరిన ఈ ఒప్పందం ప్రకారం ఎంఎన్ఎంకు ఎగువసభ స్థానం కేటాయించారు.

ఇటీవల నిర్వహించిన 'థగ్‌లైఫ్' సినిమా ఈవెంట్‌లో తమిళం నుంచే కన్నడ పుట్టిందని కమల్ వ్యాఖ్యానించడంతో భాషా వివాదం మొదలయ్యింది. కమల్ వ్యాఖ్యలను కన్నడ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో కర్ణాటకలో థగ్‌లైఫ్ చిత్రాన్ని నిషేధించాలని కోరుతూ ఆ రాష్ట్ర ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (కేఎఫ్‌సీసీ) హైకోర్టును ఆశ్రయించింది. ఆ పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం కమల్‌పై ఆగ్రహం వ్యక్తంచేసింది. క్షమాపణ చెబితే అన్నీ పరిష్కారమయ్యేవని వ్యాఖ్యానించింది. దీంతో ఈ చిత్రాన్ని కర్ణాటకలో ప్రస్తుతానికి విడుదల చేయకూడదని కమల్‌హాసన్ నిర్ణయించారు.

# దేశంలో 5 వేలు దాటిన కొవిడ్ కేసులు.. 55 మరణాలు

**ముంబయి: దేశంలో కొవిడ్ వ్యాప్తి రోజురోజుకీ పెరుగుతోంది. తాజాగా ఈ వైరస్ బారిన పడినవారి సంఖ్య ఐదు వేలు దాటింది. ఇప్పటివరకు కొవిడ్‌తో దేశవ్యాప్తంగా 55 మంది మరణించినట్లు కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ తాజా డేటా ప్రకారం.. జూన్ 6న ఉదయం 8 గంటల వరకు దేశవ్యాప్తంగా క్రియాశీల కేసుల సంఖ్య 5,364లకు చేరింది. గత 24 గంటల్లో 498 కొత్త కేసులు నమోదవగా నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మరణించిన వారిలో ఇద్దరు కేరళకు చెందినవారు కాగా.. పంజాబ్, కర్ణాటకలలో ఒక్కొక్కరు ఉన్నారు. కేరళలో అత్యధికంగా 1,679 యాక్టివ్ కేసులు ఉండగా.. గుజరాత్, పశ్చిమబెంగాల్, ఢిల్లీ తర్వాతి స్థానాల్లో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.**



కేసుల సంఖ్య వేగంగా పెరుగుతుండటంతో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ.. అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అత్యవసర వైద్య సదుపాయాలు, ఆక్సిజన్ సహా అవసరమైన వైద్య సామగ్రిని ఏర్పాటుచేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సూచించింది. వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు అప్రమత్తంగా ఉంటూ.. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు.

### రాష్ట్రాల వారీగా కొవిడ్ కేసులు ఇలా..

డేటాబోర్డులో వెల్లడించిన సమాచారం ప్రకారం.. దేశవ్యాప్తంగా క్రియాశీల కేసుల సంఖ్య 5,364 గా ఉండగా, కేరళలో అత్యధికంగా 1,679 కేసులు నమోదయ్యాయి. గుజరాత్‌లో 615, పశ్చిమబెంగాల్ 596, ఢిల్లీ 592, మహారాష్ట్ర 548, కర్ణాటక 451, తమిళనాడు 221, ఉత్తరప్రదేశ్ 205, రాజస్థాన్ 107, హరియాణా 78, ఆంధ్రప్రదేశ్ 62, బిహార్ 37, మధ్యప్రదేశ్ 36, ఛత్తీస్‌గఢ్ 24, ఒడిశా 23, పంజాబ్ 21, పుదుచ్చేరి, సిక్కింలలో ఒక్కో రాష్ట్రంలో 12 చొప్పున కేసులు, అస్సాం 10, గోవా, ఝార?ండ్ 8, జమ్మూకశ్మీర్ 7, తెలంగాణ 5, ఉత్తరాఖండ్ 3, చండీగఢ్ 2, త్రిపుర, హిమాచల్‌ప్రదేశ్‌లలో చెరో ఒకరు ఈ ఇన్ఫెక్షన్ బారినపడినట్లు తెలుస్తోంది. అరుణాచల్ ప్రదేశ్, మిజోరాంలలో ఎటువంటి కేసులు నమోదు కాలేదు.

# నేను పారిపోయానంతే.. దొంగను కాను: విజయ్ మాల్యా

**ముంబయి: బ్యాంకులకు రూ.వేల కోట్లు ఎగవేసి విదేశాల్లో దాక్కొన్న బిలియనీర్ విజయ్ మాల్యా ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. మనీలాండరింగ్ కేసులో అరెస్టయ్యే పరిస్థితులు ఉన్నాయి కాబట్టే తాను భారత్‌ను వీడానని పేర్కొన్నారు. దొంగతనం చేయలేదని.. అసలు దొంగతనం ఎక్కడ జరిగిందని ప్రశ్నించారు. తాను భారత్ నుంచి పారిపోయానని.. కానీ దొంగను కానని అన్నారు.**



"భారత్ నుంచి వెళ్లిపోయినందుకు నన్ను దేశం నుంచి పారిపోయిన వ్యక్తి అని పిలవండి. కానీ దొంగ అని ముద్ర వేయకండి. ముందస్తు ప్రణాళికలో భాగంగానే 2016లో నేను భారత్ నుంచి విదేశాలకు వెళ్లాను. కొన్ని కారణాల వల్ల తిరిగి రాలేకపోయాను. ఈ దొంగతనం అనే విషయం ఎక్కడి నుంచి వచ్చింది. భారత్‌లో న్యాయమైన విచారణ, గౌరవప్రదమైన జీవితం ఉంటుందని హామీ ఇస్తే దేశానికి తిరిగి వచ్చే విషయం గురించి ఆలోచించేవాడిని.. కానీ ఆ విధంగా ఉండదని నాకు తెలుసు" అని మాల్యా అన్నారు.

కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ పునర్నిర్మాణ ప్రణాళికతో తాను అప్పటి ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీని సంప్రదించి.. తాను సమస్యల్లో ఉన్నట్లు ఆయనకు చెప్పానని మాల్యా అన్నారు. ఈ ఆర్థిక మాంద్యంలో పని చేయలేనని.. అందుకుగాను కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ విమానాల సంఖ్యను తగ్గించాలని, ఉద్యోగులను తొలగించాలని భావిస్తున్నట్లు తెలిపానన్నారు. అయితే ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకోవద్దని, బ్యాంకుల నుంచి మద్దతు లభిస్తుందని ప్రణబ్ ముఖర్జీ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అనంతరం పలు ఆర్థిక ఇబ్బందుల వల్ల తాను దేశాన్ని వీడాల్సి వచ్చిందని తెలిపారు.

కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ రుణాల విషయంలో మోసం చేసినట్లు విజయ్ మాల్యా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. దేశం విడిచి వెళ్లిపోయిన ఆయన మార్చి 2016 నుంచీ బ్రిటన్‌లో నివసిస్తున్నారు. మాల్యాను భారత్‌కు రప్పించడానికి కేంద్రం ప్రయత్నిస్తున్న విషయం విధితమే. తాను తీసుకున్న రుణాలకు అనేక రెట్లు బ్యాంకులు తన నుంచి వసూలు చేశాయని.. అందుకు సంబంధించిన అకౌంట్ స్టేట్‌మెంట్లను అందించాలని కోరుతూ ఆయన ఇటీవల కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు.

## జపాన్ కంపెనీ ప్రయోగించిన

# మూన్ మిషన్ విఫలం



**టోక్యో: జపాన్‌కు చెందిన ఓ ప్రైవేటు కంపెనీ చేపట్టిన జాబిల్లి యాత్ర విఫలమైంది. చంద్రుడిపై తొలిసారి అడుగుపెట్టేందుకు ప్రైవేట్ అంతరిక్ష సంస్థ 'ఐస్పేస్' మూన్ మిషన్‌ను ప్రయోగించింది. అయితే, జాబిల్లిపై దిగే సమయంలో 'రెసిలెన్స్' ల్యాండర్‌తో సంబంధాలు తెగిపోవడంతో ప్రయోగం విఫలమైంది. జూన్ 6, 2025 ఉదయం 8:00 గంటలకు ల్యాండర్‌తో కమ్యూనికేషన్ ఆగిపోయినట్లు ఐస్పేస్ మిషన్ కంట్రోలర్లు వెల్లడించారు. వాటిని తిరిగి పునరుద్ధరించడం అసంభవమని.. దీంతో మిషన్‌ను ముగించామని పేర్కొన్నారు. దీనికి గల కారణం ఏంటనే విషయాన్ని తెలుసుకోవడం కోసం ప్రయత్నిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు తకేషి హకమడ తెలిపారు.**

రెసిలెన్స్ ల్యాండర్‌ను ఈ ఏడాది జనవరిలో స్పేస్‌ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్ నుంచి ప్రయోగించారు. దాదాపు ఐదు నెలల పాటు ప్రయాణించిన ఈ వ్యోమనౌక మే నెలలో చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశించింది. ప్రణాళిక ప్రకారం ఈ ల్యాండర్ జాబిల్లి ఉపరితలంపై ఉన్న 'మేర్ ఫ్రిగోరిస్' అనే పాయింట్ వద్ద సాఫ్ట్ ల్యాండ్ అవ్వాలి. అయితే రెసిలెన్స్ కక్ష్య నుంచి విడిపోయి గమ్యస్థానానికి వెళ్లిన తర్వాత మిషన్ కంట్రోలర్లు ల్యాండర్‌తో కమ్యూనికేషన్‌ను కోల్పోయారు. కాగా.. ఐస్పేస్ జాబిల్లి యాత్రకు యత్నించడం ఇది రెండోసారి. 2023లోనూ ల్యాండర్‌ను పంపించగా.. అది విఫలమైంది.

ఇక, జాబిల్లిని చేరుకున్న అయిదో దేశంగా జపాన్ ఇప్పటికే గుర్తింపు పొందిన సంగతి తెలిసిందే. గతేడాది జపాన్ ప్రయోగించిన అనే ల్యాండర్ చంద్రుడిపై సురక్షితంగా దిగింది.

## సిమ్లా ఒప్పందంపై

# ఏ నిర్ణయం తీసుకోలేదు: పాక్



**సిమ్లా : భారత్‌తో 1972లో జరిగిన సిమ్లా ఒప్పందం నుంచి వైదొలగే అంశంపై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని పాకిస్థాన్ విదేశాంగ శాఖ వివరణ ఇచ్చింది. ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసీఫ్ మాట్లాడుతూ సిమ్లా ఒప్పందానికి ఇక విలువలేదు.. అదొక డెడ్ డాక్యుమెంట్ అని వ్యాఖ్యానించారు. సింధూజలాల ఒప్పందాన్ని సస్పెండ్ చేశారో లేదో తెలియదు గానీ.. సిమ్లా అగ్రిమెంట్ పనైపోయింది అని పేర్కొన్నారు. దీంతో తాము 1948 నాటి స్థితికి చేరుకొన్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న నియంత్రణ రేఖ కాస్తా కేవలం కాల్పుల విరమణ రేఖగా భావిస్తామన్నది ఆయన ఉద్దేశం. 1948 భారత్-పాక్ యుద్ధం తర్వాత దీనిని ఏర్పాటు చేశారు.**

ఈ నేపథ్యంలో విదేశాంగశాఖ ప్రతినిధి వివరణ ఇస్తూ "భారత్‌తో ఏ ద్వైపాక్షిక ఒప్పందాన్ని రద్దు చేసుకోవడానికి అధికారికంగా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో ప్రస్తుతం ఆ దేశంతో ఉన్న సిమ్లా ఒప్పందంతో సహా అన్ని ద్వైపాక్షిక ఒప్పందాలు అమల్లో ఉంటాయి" అని ఆ దేశానికి చెందిన ది ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్‌కు వెల్లడించారు. 1971లో భారత్-పాక్ యుద్ధం తర్వాత ఈ ఒప్పందం చేసుకొన్నారు. దీని ప్రకారం భారత్-పాక్ సంబంధాల నిర్వహణకు సంబంధించిన చర్యలు తీసుకొంటారు.

ఈ ఒప్పందం ద్వారా శాంతియుత ద్వైపాక్షిక సంబంధాలను పునరుద్ధరించుకోవాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించుకోవాలని రెండు దేశాలు తీర్మానించాయి. ఇందులో కశ్మీర్ అంశమూ ఉంది. ఈ ఒప్పందంపై అప్పటి భారత ప్రధాని ఇందిరా గాంధీ, పాక్ అధ్యక్షుడు జుల్ఫికర్ అలీ భుట్టో సంతకాలు చేశారు. దీని ప్రకారం ఇరుదేశాలు మూడో దేశం జోక్యం లేకుండా ద్వైపాక్షిక చర్చల ద్వారా వివాదాలను పరిష్కరించుకోవాలి. జమ్మూ కశ్మీర్‌లో కాల్పుల విరమణ లైన్‌గా నియంత్రణ రేఖను పునర్నిర్వచించడం. దానిని మార్చకూడదన్న నిర్ణయానికి రెండు దేశాలు కట్టుబడటం. బంగ్లాదేశ్ సార్వభౌమత్వాన్ని గుర్తించడంతోపాటు ఆ దేశంతో సంబంధాలను సాధారణ స్థితికి తేవడానికి పాకిస్థాన్ కట్టుబడటం వంటి అంశాలున్నాయి.

ఏప్రిల్‌లో పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన తర్వాత నుంచి భారత్-పాక్ సంబంధాలు పూర్తిగా క్షీణించాయి. భారత్ సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేసింది. ఆ తర్వాత మే 7వ తేదీన పాకిస్థాన్, పీవోకేలోని 9 ఉగ్ర స్థావరాలపై దాడులు చేసింది. ఆ తర్వాత మే 8,9,10 తేదీల్లో పాక్ సైన్యం భారత మిలిటరీ బేస్‌లపై దాడికి యత్నించగా.. మన దళాలు తిప్పికొట్టాయి. ఆ తర్వాత పాక్ అభ్యర్థన మేరకు భారత్ ఆపరేషన్ సిందూర్‌కు తాత్కాలిక విరామం ప్రకటించిన విషయం తెలిసిందే.




డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

తెలుగురాష్ట్రం దినపత్రిక

https://epaper.telugurastram.com

శనివారం 07 జూన్ 2025

## తహశీల్దార్ నాగలక్ష్మమ్మపై కొడవలితో దాడి



**అయినవిల్లి, జూన్ 6 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

తహశీల్దార్ సి నాగ లక్ష్మమ్మ పై తొత్తరమూడి గ్రామం జోగిరాజుపాలెం కు చెందిన మీసాల సత్యనారాయణ కొడవలితో డాడికి పాల్పడినట్లు వివరించారు శుక్రవారం కార్యాలయంలో విధి నిర్వహణలో ఉన్న తహశీల్దార్ నాగ లక్ష్మమ్మ పై దాడికి పాల్పడగా సిబ్బంది అప్రమత్తమై దాడికి పాల్పడిన వ్యక్తిని నిర్బంధించి పోలీసులకు సమాచారం అందించారు. నాగ లక్ష్మమ్మ చేతికి రక్తపు గాయమైనట్లు తెలిపారు. పోలీసులకు సమాచారం ఇచ్చినా స్పందించకపోవడంతో ఎస్పీ కార్యాలయానికి సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ శ్రీహరికోటి శాస్త్రి ఘటనా స్థలానికి చేరుకుని నిందితుని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు.

## అయినవిల్లి తహసిల్దార్ సిహెచ్. నాగలక్ష్మమ్మను పరామర్శించిన జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్

**-దాడి చేసిన నిందితుడిపై చట్టపరమైన చర్యలకు ఆదేశాలు**



**అమలాపురం, జూన్ 6, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అయినవిల్లి మండలం తహసిల్దార్ సీ హెచ్ నాగలక్ష్మమ్మ పై జరిగిన దాడి ఘటన పై జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అయినవిల్లి మండలం తొత్తరమూడి శివారు జోగిరాజుపాలెం గ్రామానికి చెందిన వ్యక్తి మీసాల సత్యనారాయణ శుక్రవారం సాయంత్రం తహసిల్దార్ కార్యాలయంలోకి ప్రవేశించి, తహసిల్దార్ సిహెచ్. నాగలక్ష్మమ్మ పై కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో కలెక్టర్ తహసిల్దార్కి ఫోన్ చేసి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆమె ఎడమ చేతి పై చిన్న గాయం అయిందని కలెక్టర్ కి తెలిపారు. ఆమె త్వరగా కోలుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. విధి నిర్వహణలో నిమగ్నమైన అధికారిపై అలాంటి దాడి జరగడం బాధాకరమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణిస్తున్నామని, నిందితుడిపై భారతీయ న్యాయ స్మృతి (భారత న్యాయ సాంహిత %- దీచీ%)లోని సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ ను కలెక్టర్ ఆదేశించారు. అయినవిల్లి సబ్ ఇన్స్పెక్టర్ నిందితున్ని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారని తెలిపారు. జిల్లా యంత్రాంగం ఆమెకు అన్ని విధాలుగా మద్దతు ఇస్తోందని కలెక్టర్ స్పష్టం చేశారు.

## జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యాసంస్థలలో 50 శాతం ఫీజు రాయితీకి

**-జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సుముఖం.**

**అమలాపురం, జూన్ 6, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

జర్నలిస్టుల పిల్లలకు విద్యాసంస్థలలో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని కోరుతూ ఏపీయూడబ్ల్యూజె అంబేద్కర్ కోనసీమ జిల్లా కమిటీ అధ్యక్షుడు మండేల నాగ వెంకట ప్రసాద్ (బాబి), జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొర్లపాటి ప్రదీప్ కుమార్ ల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఎం.మహేష్ కుమార్ కు శుక్రవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ జర్నలిస్టుల ప్రతినిధులతో మాట్లాడుతూ ఫీజు రాయితీ కల్పించడానికి సుముఖత వ్యక్తం చేశారు. గత సంవత్సరం కూడా జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించాలని జిల్లా విద్యా శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చానని తెలిపారు. ఫీజు రాయితీ ఇచ్చే విషయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురయ్యాయా అని కలెక్టర్ జర్నలిస్టు యూనియన్ ప్రతినిధులను అడిగారు. గత ఏడాది ఇబ్బందులు ఎదురైందని ఈ సారి అటువంటిది లేకుండా ఉత్తర్వులు ఇవ్వాలని అధ్యక్షులు బాబీ కోరారు. తప్పనిసరిగా ఇస్తానని డి ఈ ఓ ను ఫైల్ పుటప్ చేయమని ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో డీఐపీఆర్వో లక్ష్మీనారాయణ, జిల్లా కోశాధికారి ఎంవి అబ్బాస్, అరిగెల రుద్రా శ్రీనివాస్, రంబాల నాగ సత్యనారాయణ, వట్టికూటి గోవిందరావు పాల్గొన్నారు.

## వీరేశ్వర స్వామి సేవలో రామచంద్రాపురం కొత్తపేట ఆర్ డి ఓ దంపతులు



**ఐ పోలవరంజూన్ 6(తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరేశ్వర స్వామి వారిని రామచంద్రపురం, కొత్తపేట ఆర్ డి ఓ దంపతులు డి అఖిల , పి శ్రీకర్ శుక్రవారం దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. తొలుత వీరికి ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామల కుమార్ ప్రత్యేక దర్శనం అందించారు. స్వామి వారి శేష వస్త్రం, చిత్ర పటం, ప్రసాదం అందించి వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ సహాయ కమీషనర్ మరియు కార్యనిర్వహనాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యం

**- కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు**



**రావులపాలెం, జూన్ 6, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ప్రజల సమస్యల్ని తెలుసుకుని సత్వరం పరిష్కరించడమే లక్ష్యంగా ప్రతి వారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం ఆయన ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఎమ్మెల్యేకు 80 వినతులు అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రజలు కొనియాడుతున్నారని అన్నారు. సమస్యలు పరిష్కారం అవుతున్నాయని అర్జీదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజల మన్ననలు అందుకుంటోందని, రాబోయే కాలంలో మరింత సుపరిపాలన అందిస్తామని అన్నారు. ప్రజల వినతులను పరిష్కారం కోసం ఆయా శాఖల అధికారులకు అందజేయడంతో పాటు ఆన్ లైన్ లో కూడా నమోదు చేస్తామని ఎమ్మెల్యే సత్యానందరావు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుత్తుల పట్టాభి రామారావు, జక్కంపూడి వెంకటస్వామి, కేతా శ్రీనివాస్, పడాల బులి కొండారెడ్డి, పెచ్చెట్టి చిన్నారావు, చిన్న కేవీ తదితరులు పాల్గొన్నారు.





## ఈ నెలలోనే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం

**-స్టార్టప్ వేదికగా ఇన్నోవేషన్ హబ్-సీఎం చంద్రబాబు చేతుల మీదుగా..-ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఎస్పీ డీ నరసింహ కిషోర్ తో కలిసి పరిశీలించిన జిల్లా కలెక్టర్ పీ ప్రశాంతి**







**రాజమహేంద్రవరం, జూన్ 6, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా రాజమండ్రి రూరల్ పరిధిలో ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్టీఐహెచ్) ప్రారంభోత్సవానికి సన్నాహాలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పీ ప్రశాంతి తెలిపారు. ఈ నెల 10 లేదా 11 తేదీలో సీఎం ప్రారంభిస్తారని ఆమె చెప్పారు. బొమ్మూరులో ఆర్టీఐహెచ్ భవన ఏర్పాటు పనులను నగర కమిషనర్ కేతన్ గార్గ్ తో కలిసి గురువారం సాయంత్రం పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పీ ప్రశాంతి మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతికత, ఇన్నోవేషన్ యువతలోని నైపుణ్యం కలిగినవారికి వారి అభివృద్ధికి దోహదం చేస్తాయన్నారు. రాష్ట్రంలో విశాఖపట్నం, రాజమండ్రి, ఎన్టీఆర్, తిరుపతి, అనంతపురం జిల్లాలలో ప్రభుత్వం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మన జిల్లాలో అడ్వాన్స్ స్కోప్ మోడల్ లో ఈ ఇన్నోవేషన్ సెంటర్ ను ప్రారంభించుకోనున్నట్లు కలెక్టర్ పీ ప్రశాంతి చెప్పారు. ఈ హబ్ నిర్వహణ విషయంలో గ్రీన్ కో ఎనర్జీ, ఓఎన్జీసీ, గెయిల్, అవంతి తదితరులు ప్రమోటర్లుగా ఉంటారని కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో పారిశ్రామిక ప్రగతి, తద్వారా ఒక శక్తివంతమైన స్టార్టప్ పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ దోహదపడుతుందన్నారు. యువతకు ఆసక్తి ఉన్న రంగాల్లో సరైన దిశా నిర్దేశం చేయడం, వారికి తగిన నాలెడ్జి అందించి ప్రతి ఒక్కరికి ఉద్యోగావకాశాలు కల్పించటం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని ఈ సందర్భంగా కలెక్టర్ తెలియజేశారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ రాజమండ్రి రూరల్ నియోజక వర్గం పరిధిలో టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చెయ్యడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు కృతజ్ఞతలు తెలియజేశారు. యువత లోని నైపుణ్యం పెంచే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎప్పుడూ యువతతో పోటీపడే ఆలోచనలు ఆయనకే సాధ్యం అన్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్ల పరిశీలన చేశామని తెలిపారు. ఈ పర్యటనలో ఎస్పీ డీ నరసింహ కిషోర్, మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వాడపల్లి వెంకన్న ఆలయంలో అభివృద్ధి పనుల పరిశీలన







**ఆత్రేయపురం, జూన్ 6,(తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కోనసీమ తిరుమల ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ పరిశీలించారు. తాత్కాలిక అన్నదాన షెడ్డు పనులు, శ్రీనివాస పార్కింగ్ స్థలం మరమత్తు పనులు, మాడవీధుల్లో ఉన్న స్వాతంత్ర్య సమర యోధుల స్థూపంలను పరిశీలించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావుకు పలు సూచనలు చేసారు. అనంతరం ఎంపీడీవో బి.కె.ఎస్.ఎస్. వెంకటరామన్, తహశీల్దార్ టి.ఆర్.రాజేశ్వరరావు, ఈవో చక్రధరరావులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. వేణుగోపాలస్వామికి నవనీతాలంకరణ : శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సన్నిధిలోని రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారికి అర్చకులు నవనీత అలంకరణ చేసారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నప్రసాద భవన నిర్మాణానికి రూ.1.16 లక్షల విరాళం :వాడపల్లి వెంకన్న ఆలయంలో చేపట్టిన వకుళమాత అన్న ప్రసాద భవన నిర్మాణానికి శుక్రవారం భీమవరంకు చెందిన సి.వి.చంటి,శాంతి దంపతులు రూ.1,16,000 విరాళంగా సమర్పించారు. ప్రత్యేక దర్శనం అనంతరం దాతలకు దేవస్థానం కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో అర్చకులు వేదాశీర్వచనం చేసి స్వామి వారి చిత్ర పటం అందజేసారు.

## నేడు కడియపులంక నర్సరీలో యోగాంధ్ర కార్యక్రమం

### -ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు






**కడియం, జూన్ 6(తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంతూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి ఆదేశాలు మేరకు శనివారం ఆరు గంటలకు సర్ అర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ కడియం ఆధ్వర్యంలో కడియపులంక శ్రీ సత్యదేవా నర్సరీ (పుల్లా చంటి నర్సరీలో) నిర్వహిస్తారు.ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగనున్న ఈ కార్యక్రమం ఏర్పాట్లును శుక్రవారం జాయింట్ కలక్టర్ చిన్న రాముడు,రాజమహేంద్రవరం ఆర్డీవొ కృష్ణ నాయక్, ఏపీఎంఐపీ పీడీ దుర్గేష్,డిటివొ వెంకటాచలం, జిల్లా ఉద్యాన అధికారి సుజాత,తాసిల్దార్ సునీల్ కుమార్, అసోసియేషన్ అధ్యక్షులు రత్నం అయ్యప్ప,నర్సరీ రైతు పుల్లా పెద్ద సత్యనారాయణ సమావేశం నిర్వహించి చర్చించారు..ఈ యోగాంధ్ర కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్య చౌదరి,జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి ముఖ్య అతిధులు గా విచ్చేస్తారని అధికారులు తెలిపారు.జిల్లాలో పలుశాఖల అధికారులు కూడా పాల్గొనే ఈ యోగాంధ్ర కార్యక్రమానికి నర్సరీ రైతులందరూ హజరు కావాలని అసోసియేషన్ అధ్యక్షులు రత్నం అయ్యప్ప కోరారు.

## 62వ పుట్టినరోజు వేడుకలలో మల్లాడి.

### -వేలాదిగా తరలివచ్చి అభిమానులు



**యానం జూన్ 6 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

యానాం యర్ర గార్డెన్స్ లో శుక్రవారం ఉదయం మల్లాడి అభిమాన సంఘం ఆధ్వర్యంలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు 62వ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. కుల మతాలకు అతీతంగా యానాం ఊరి కోసం పనిచేసే నిజాయితీపరుడిని రానున్న ఎన్నికలలో ఎమ్మెల్యేగా ఎన్నుకోవాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. ముందుగా ఇంటి వద్ద ఏర్పాటుచేసిన ప్రత్యేక పూజలలో మల్లాడి కృష్ణారావు, ఉదయలక్ష్మి దంపతులు తోపాటు ఆయన కుమారుడు వంశీ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడనుండి ఆయనను సభా వేదిక వద్దకు అభిమానులు కోలాటం నృత్యాలతో, పుష్పాలతో అపూర్వ రీతిలో స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మల్లాడి ఆసక్తికరంగా మాట్లాడారు. మల్లాడి కృష్ణారావు రాజకీయం ఒక్క యానాం సీటుతో ఉండదని, రాబోయే ఎన్నికలలో పుదుచ్చేరిలోని ఐదు ప్రాంతాల నుండి ఎమ్మెల్యేలను గెలిపించే విధంగా ఉంటుందని తన నిర్ణయాన్ని కుండ బద్దలు కొట్టినట్టు చెప్పారు.యానాం నియోజకవర్గం లో 36 సంవత్సరాలుగా నీతి నిజాయితీగా ప్రజలకు సేవలు అందిస్తున్నానని అన్నారు.తనను నమ్మిన ఇద్దరు వ్యక్తులు సహాయంతో అనేక సేవా కార్యక్రమాలను ప్రజలకు అందిస్తున్నానని వెల్లడించారు. కోట్లాది రూపాయల కేంద్ర రాష్ట్రా ప్రభుత్వాల నిధులతో అనేక అభివృద్ధి పనులను యానాం నియోజకవర్గంలో పూర్తి చేసినట్లు తెలిపారు. తనను నమ్ముకున్న ప్రజలకు అన్ని విధాల అండగా నిలుస్తానని, రాబోయే రోజులలో యానాం నియోజకవర్గం లో కేంద్ర ప్రభుత్వం సహకారంతో చేయనున్న అభివృద్ధి పనులు, కొత్త ప్రాజెక్టు లు గురించి ప్రజలకు వివరించారు. యానంలో ప్రసిద్ధి చెందిన శ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకుని ఎంతో కొంత తమ వంతు సహాయాన్ని ఆలయ నిర్మాణానికి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.వచ్చే ఏడాది నుండి తాను పుట్టినరోజు వేడుకలకు దూరంగా ఉంటానని, పుట్టినరోజులు కోసం తనను ఒత్తిడికి గురిచేసి ఇబ్బంది పెట్టవద్దని ప్రజలకు సూచించారు. అయితే రానున్న ఎన్నికలలో పోటీ కోసం మల్లాడి నుండి స్పష్టత వస్తుందని ఎదురు చూస్తున్న అభిమానులకి ఈసారి కూడా నిరాశ ఎదురైంది. అనంతరం అభిమానులు తీసుకువచ్చిన భారీ కేక్ లు కటింగ్ నిర్వహించారు. మండుటెండలను సైతం లెక్కచేయకుండా యానాం పరిసర ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున అభిమానులు తరలివచ్చి అభిమాన నేతకు ఆత్మీయ అభినందనలు శుభాకాంక్షలు తెలియజేశారు. మల్లాడి అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వివిధ ప్రదర్శనలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. మల్లాడి అభిమాన సంఘం ఆధ్వర్యంలో గత వారం రోజుల నుండి నిర్వహిస్తున్న వివిధ పోటీలలో విజేతలకు బహుమతులను అందజేశారు. పుట్టినరోజు వేడుకలకు వేలాదిమంది తరలిరాడంతో సభా ప్రాంగణం జనంతో కిక్కిరిసిపోయింది. ఈ కార్యక్రమంలో కోన వెంకన్న బాబు కోన సత్తియ్య, ధవులూరి సత్తిబాబు, గొర్రెల వివి సత్యనారాయణ, కోన వివి రామచంద్రరావు, కాపగంటి ఉమా శంకర్, ప్రవీణ్, వేగేశ్న భాస్కర్ రాజు, ముదునూరి సహదేవరాజు, కనకాల శ్రీనివాస్, కోన బుజ్జి ,కోన సీతారామయ్య, పెద్దిరెడ్డి ఉమామహేశ్వరరావు, మల్లాడి అభిమాన సంఘం ప్రతినిధులు, పుదిచేరితో పాటు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## బాలత్రిపుర సుందరి అమ్మవారికి 100 గ్రాముల వెండి అందజేత



**భీమవరం జూన్ 6, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

భీమవరం మెంటేవారి తోటలోని శ్రీవిజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాల త్రిపుర సుందరి అమ్మవారి వెండి మకర పీఠానికి దాతలు 100 గ్రాముల వెండిని విరాళాలు అందించారు. శుక్రవారం భీమవరంకు చెందిన కోత్తూరి వెంకటేశ్వరరావు లక్ష్మి శివరంజని దంపతులు 100 గ్రాముల వెండిని విరాళంగా ఆలయ ఆలయ అభివృద్ధి కమిటీకి అందించారు. ఆలయ అర్చకులు పూజలు చేసి దాతలకు అమ్మవారి చిత్రపటాన్ని అందించి సత్కరించారు. వెండి పీఠానికి దాతలందిస్తున్న సహకారానికి ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## శివారు గ్రామాలకు కూడా శుద్ధమైన నీరును అందిస్తాం

### - రాయలంలో క్లోరినేషన్ ప్లాంట్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు

**భీమవరం జూన్ 6, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



భీమవరం నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి శివారు ప్రాంతాలకు కూడా శుద్ధమైన మంచినీటిని అందిస్తామని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం మండలం రాయలం గ్రామంలో నూతనంగా నిర్మించిన క్లోరినేషన్ ప్లాంట్ ను ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించి మాట్లాడారు. పిడబ్ల్యూఎస్ స్కిం 2 కింద సుమారు రూ 6 లక్షల వ్యయంతో రాష్ట్రంలోనే మొదటి క్లోరినేషన్ ప్లాంట్ ను రాయలంలో ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. మొదటి విడతగా భీమవరం నియోజకవర్గంలో ఏర్పాటు చేశామని, రానున్న రోజుల్లో అన్ని గ్రామాల్లోను ఈ క్లోరినేషన్ ప్లాంట్ ను ప్రారంభిస్తామని అన్నారు. మోడరన్ నియోజకవర్గంగా భీమవరాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో రాయలం గ్రామస్థులు, కూటమి నాయకులు అభిమానులు కార్యకర్తలు వీర మహిళలు పాల్గొన్నారు.

## శ్రీముఖంద 1 గ్రామ్ గోల్డ్ షోరూంను ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు





**భీమవరం జూన్ 6, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

భీమవరం ఛాంబర్ అఫ్ కామర్స్ రోడ్డులో నూతన శ్రీముఖంద 1 గ్రామ్ గోల్డ్ షోరూంను రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ప్రారంభించారు. ప్రస్తుత పరిస్థితుల్లో వన్ గ్రామ్ గోల్డ్? కు ఎంతో క్రేజ్ పెరుగుతుందని, బంగారు నగలకు దీటుగా వన్ గ్రామ్ గోల్డ్ లో సైతం అన్ని రకాల ఆభరణాలు అందుబాటులోకి వస్తున్నాయని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. నిర్వాహకులు సిహెచ్ కిషోర్, వి రంజిత్ మాట్లాడుతూ వన్ గ్రామ్ గోల్డ్ కు ఎంతో ఆదరణ పెరుగుతుందని, తక్కువ బడ్జెట్ లోనే బంగారు ఆభరణాలను కొనుగోలు చేసేందుకు ఇదొక మంచి మార్గమని అన్నారు. వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలపై చాలామందికి ఆసక్తి పెరుగుతుందని, తక్కువ ధరలో బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి ఈ వన్ గ్రామ్ గోల్డ్ ఒక మంచి ఎంపిక అని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, జనసేన నాయకులు బండి రమేష్ కుమార్, వబిలిశెట్టి రామకృష్ణ, కారుమూరి సత్యనారాయణ మూర్తి, షోరూం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యసభకు సరైన వ్యక్తి పాక

### - రాజ్యసభ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసిన పాకను సత్కరించిన మార్నింగ్ కాఫీ క్లబ్ సభ్యులు



**భీమవరం జూన్ 6, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మేధావుల సభకు దశాబ్దాల కలల అనుభవం కలిగిన వ్యక్తి పాక సత్యనారాయణ వెళ్ళడం మన భీమవరం జిల్లాకే గర్వకారణమని మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బోండా రాంబాబు, కో కన్వీనర్ ఓలేటి శ్రీనివాస్, పిఆర్వో భట్టిప్రోలు శ్రీనివాసరావు, కొత్త శ్రీనివాస్ అన్నారు. రాజ్యసభ సభ్యునిగా పాక సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేసి భీమవరం వచ్చిన సందర్భంగా మార్నింగ్ కాఫీ క్లబ్ ఆధ్వర్యంలో సత్కరించారు. వారు మాట్లాడుతూ దశాబ్ధాల సేవలకు ఫలితం దక్కిందని, రాజకీయ మేధావికి సరైన పదవి లభించిందన్నారు. ఇటువంటి పదవికి ఆయనే అర్హుడని భారతీయ జనతా పార్టీ గుర్తించిందని, మేదావుల సభ రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎంపిక చేసిందని, ఈ పదవికి ఆయనే సరైనోడని ఆయన అభిమానులే కాదు అన్ని రాజకీయ పక్షాలు, మేధావుల వర్గాలు కూడా నొక్కి వక్కాణిస్తున్నాయన్నారు. రాజ్యసభ సభ్యులు సత్యనారాయణ మాట్లాడుతూ మీ ఆదరణ ఆప్యాయత ఎప్పటికీ మరవలేనని అన్నారు. అనంతరం సత్యనారాయణను సత్కరించారు.కార్యక్రమం లో కారుమూరి సత్యనారాయణ, చవ్వ భామ కృష్ణమూర్తి, కురిశెట్టి కాశి, బొద్దు వాసు, కోట్ల నాని, పులవర్తి రామకృష్ణ, బంగారు రాము, కనగర్ల కిషోర్, తటవర్తి బధరి, సభ్యులు పాల్గొన్నారు.

## వెలుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజలకి అవగాహన, మొక్కలను నాటే కార్యక్రమం

**మచిలీపట్నం జూన్ 6(తెలుగురాష్ట్రం ప్రతినిధి)**




పర్యావరణం మానవ మనుగడకు జీవనాడి పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీనియర్ పాత్రికేయుడు, వెలుగు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు చందమామ బాబు అన్నారు. మచిలీపట్నంలో వెలుగు సంస్థ ఆధ్వర్యంలో "ప్రపంచ పర్యావరణ దినోత్సవం పుష్కరించుకుని నగరంలో వివిధ ప్రాంతాల్లో ప్రజల్ని చైతన్య పరుస్తూ మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ, ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని అన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం ఈ భూమి మీద నివసిస్తున్న ప్రతి మానవుని బాధ్యత అని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రజల్లో మార్పు వచ్చి పర్యావరణ ఫ్రెండ్లీ నేచర్ దిశగా అడుగులు వేస్తారని, మానవాళి జీవన విధానాలను కొంతవరకు మార్పులు చేసుకుంటే కాలుష్యాన్ని నివారించవచ్చని, ప్రతి ఒక్కరూ జీవన విధానాలను మార్చుకొని ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించడంతోపాటు ఉపయోగించిన ప్లాస్టిక్ సక్రమంగా డిస్పోస్ చేయాలని అన్నారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు రేపల్లి వసంతరావు, హరికృష్ణ, ప్రియదర్శిని శ్రీలత ఇతర సభ్యులు పాల్గొన్నారు

## 11కెవి విద్యుత్ వైర్లతో బెంబేలెత్తుతున్న రైతులు.

### - విద్యుత్ అధికారులు పట్టించుకోవట్లేదు అని ఆవేదన.



**కోరుకొండ జూన్ 6(తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



పశ్చిమ గోనగూడెం సబ్ స్టేషన్ గుమ్మళ్ళదొడ్డి మధ్య ఉన్న పొలాలలో 11 కెవి వైర్లతో పెను ప్రమాదం పొంచి ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. పెనుగాలులు, వర్షాలు కారణంగా 11 కెవి విద్యుత్ స్తంభాలు ఒరిగిపోవడంతో విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతూ వ్యవసాయ పొలాల్లో పనులకు అంతరాయం కలిగిస్తూ ఇప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందని బిక్కుబిక్కుమంటూ పనులు సాగిస్తున్నారు. రైతులు ఈ విషయాన్ని పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులు దృష్టికి తీసువెళ్లిన, పట్టించుకోవట్లేదు అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అని ఆందోళన చెందుతూ పొలం పనులు సాగిస్తున్నామంటున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు పొలాల్లో ఉన్న వైర్లు పై దృష్టి సారించి, రైతులకు ప్రాణ రక్ష కల్పించాలని వేడుకుంటున్నారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక


## చింతలపూడి సీఐగా క్రాంతికుమార్



**చింతలపూడి, జూన్ 6 (తెలుగురాష్ట్రం విలేఖరి):** చింతలపూడి సిఐగా క్రాంతికుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అన్నారు. కోడి పందాలు, పేకాట ఇతర అసాంఘిక కార్యకలాపాలు, జరిగితే, నేరుగా తమకు సమాచారం ఇవ్వాలని అన్నారు. సైబర్ క్రైమ్ లపై అవగాహన కలిగి ఉండాలని, ప్రతి విద్యార్థి ప్రతి మహిళ శక్తి యాప్ ను తమ ఫోన్లో ఇన్స్టాల్ చేసుకోవాలన్నారు. ఎవరైనా ఆపదలో ఉంటే 112 కు డైల్ చేయండని సూచించారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన అవగాహన కలిగి ఉండాలన్నారు.వాహనదారులు కచ్చితంగా లైసెన్స్, ఇన్సూరెన్స్, వాహన పత్రాలు కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు.

## వితంతు మహిళలకు పెన్షన్లు మంజూరు చెయ్యాలి

### -బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మత్స్య కొండ బాబు



**చింతూరు, జూన్ 6(తెలుగు రాష్ట్రం విలేకరి):** 2022 సంవత్సరంలో తమ భర్తలను కోల్పోయిన గిరిజన మహిళలకు వింతంతు పెన్షన్ లు మంజూరు చెయ్యాలనీ బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పాంగి మత్స్య కొండ బాబు పేర్కొన్నారు. పాడేరు లో విడుదల చేసిన పత్రిక ప్రకటన లో అయన మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో భర్తలను కోల్పోయిన గిరిజన మహిళలు 2022 లో మరణ ధ్రువ పత్రాలు వంటివి సకాలంలో చేసుకోలేక వితంతు పెన్షన్లకు దరఖాస్తు చేసుకోలేదనీ అన్నారు. ప్రస్తుతం వారు వితంతు పెన్షన్ కొరకు దరఖాస్తు చేసుకోవాలని సచివాలయాలకు వెళ్తే 2023 లో భర్తలను కోల్పోయిన వారికే మాత్రమే పెన్షన్ కొరకు దరఖాస్తు చేసుకోవటం అవుతుందనీ సచివాలయం సిబ్బంది, మండల అధికారులు తెలిపిన సమాచారం బాధిత వితంతు మహిళలు తమ దృష్టికి తీసుకొని వచ్చారని అయన తెలిపారు. ఆర్థిక సమస్యలతో బ్రతుకు బారాన్ని వారు మోయలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కావున సంబంధిత శాఖ అధికారులు 2022 లో మరణించించిన వ్యక్తుల మహిళలకు పెన్షన్ లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు, వెబ్సైటులో 2023 సంవత్సరంలో భర్తలు మరణించించిన" మహిళలకు పెన్షన్ల మంజూరుకు అవకాశం కల్పించి, 2022 లో భర్తలు మరణించిన వింతంతువులకు అవకాశం కల్పించక అల్లూరి జిల్లా వ్యాప్తంగా వేలాది మంది బాధితులు సచివాలయాలు, మండల పరిషత్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారని వాపోయారు. జిల్లా కలెక్టర్, డీఆర్డీఏ పీడీ స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి బాధిత వితంతు మహిళలకు పెన్షన్లు మంజురు చేసేందుకు తగు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## నడిచే నీడలు పుస్తక ఆవిష్కరణ చేసిన టీడీపీ ఇంఛార్జి ఎరిక్షన్ బాబు



**యర్రగొండపాలెం, జూన్ 6 (తెలుగురాష్ట్రం విలేఖరి):** ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం స్థానిక కస్తూరిభా పాఠశాల మరియు కళాశాల ఆవరణలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రముఖ రచయిత, సాహితీవేత్త, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత గొట్టిముక్కుల నాసరయ్య రాసిన నడిచే నీడలు పుస్తకాన్ని నియోజకవర్గం టీడీపీ ఇంఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవిత అనుభూతులు సమాజ దృశ్యాలు మనసు లోతుల్లో నలిగిన భావాలన్ని%శీ%టినీ కవితా రూపంలో ఒదిగించగల నైపుణ్యం గల కవి అని అభినందిచారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రెడ్డి, పెద్దారవీడు టీడీపీ మండల అధ్యక్షులు మెట్టు శ్రీనివాసరెడ్డి, గొట్టం శ్రీనివాస రెడ్డి, ఎపిడి నిర్మలా దేవి, ఎపిఓ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్



**జగ్గయ్యపేట, జూన్ 6 (తెలుగురాష్ట్రం విలేకరి):** మచిలీపట్నం బైపాస్ రోడ్డు నందు ఆటో, డీసీఎం ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్ గాయపడి రోడ్డుపై పడి ఉండగా జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య మోపిదేవి శ్రీ వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని దర్శించుకుని తిరుగు ప్రయాణమై జగ్గయ్యపేట వస్తూ ఉండగా మార్గమధ్యలో యాక్సిడెంట్ జరిగి ఉండగా ఘటన స్థలానికి చేరుకొని ఆటో డ్రైవర్ ను దగ్గరుండి కారులో ఎక్కించి కొంత దూరం తీసుకురాగా మధ్యలో అంబులెన్స్ ఎదురవగా క్షతగాత్రుడి ని అంబులెన్స్ లోకి ఎక్కించి మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగినది. ఈ సందర్భంగా క్షతగాత్రుడి కుటుంబ సభ్యులు ఆపదలో ఆదుకున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్యకి కృతజ్ఞతలు తెలిపారు.

## మెగా లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోండి

### -చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు



**చింతలపూడి, జూన్ 6 (తెలుగు రాష్ట్రం విలేఖరి):** చింతలపూడి జూనియర్ సివిల్ కోర్టు జూలై 5 వ తేదీన జరిగే మెగా లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్. మధు బాబు కోరారు. శుక్రవారం కోర్టు ఆవరణంలో పోలీస్ ఆఫీసర్స్ తో లోక్ అదాలత్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసులు పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్ నువినియోగించుకోవాలని సూచించారు. మెగా లోక్ అదాలత్ లో క్రిమినల్ సివిల్ బ్యాంక్ రికవరీ, చెక్ బౌన్స్ బిఎస్ఎన్ఎల్ రికవరీ, కుటుంబ తగాదాలు, మనోవర్తి ప్రామిసరీ నోట్ కేసులు పరిష్కారం చేసుకో వచ్చని తెలిపారు. రాజీ చేసుకునే వారు ప్రతి రోజు ఫ్రీ లోక్ అదాలత్ సెట్టింగ్స్ నిర్వహిస్తున్నారన్నారు. కేసులు రాజీ చేసుకోవడం ద్వారా విలువైన సమయము డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీలుగుమిల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్స్ బి. వెంకటేశ్వరరావు, చింతలపూడి ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ క్రాంతి కుమార్, చింతలపూడి టీ నర్సాపురం ధర్మాజీగూడెం తటికలపూడి సబ్ ఇన్స్పెక్టర్స్, కోర్ట్ కానిస్టేబుల్స్, కోర్టు సూపర్నెంట్ పాల్గొన్నారు.

## మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ




**మారేడుమిల్లి, జూన్ 6(తెలుగు రాష్ట్రం విలేకరి):** మారేడుమిల్లి మండలం ఆకుమామిడికోట గ్రామంలో శుక్రవారం వారపు సంత సందర్భంగా ఆకుమమిడికోట చుట్టుపక్కల లోతట్టు గ్రామాల గిరిజన యువకులు,గ్రామస్తులు స్వతఃసిద్ధంగా బయటికి వచ్చి మావోయిస్టులకు వ్యతిరేకంగా పెద్ద సంఖ్యలో ర్యాలీ నిర్వహించారు. ఇందులో సుమారు వందమంది గిరిజన పుత్రులు పాల్గొన్నారు. మావోయిస్టులు తమ గ్రామాలకు రావద్దని తెలియజేసి, అభివృద్ధిని అడ్డుకోవద్దని నినాదాలు చేసినారు.ఈ ర్యాలిలో మావోయిస్టుల అరాచకాలను ఎండకడుతూ మావోయిస్టులు ఇంతకుముందు వాళ్ళు చేసే అరాచకాల వల్ల అభివృద్ధి కుంటుపడగా గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వం చొరవతో అభివృద్ధి ముందుకు వెళుతుందని గ్రహించి మావోయిస్టులకు వ్యతిరేకంగా ప్లకార్డులు, ఫ్లెక్షిలతో నినాదాలు ప్రదర్శించినారు.

## మహిళలకు రూ.15 వేలు ఆర్థిక సహాయం అందజేసిన మంత్రి సుభాష్



**రామచంద్రపురం, జూన్ 6 (తెలుగు రాష్ట్రం విలేఖరి):** కొత్తూరు గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఒక మహిళకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రూ.15 వేలు ఆర్థిక సహాయం చేసి ఆపన్న హస్తం అందించారు. కొత్తూరుకు చెందిన గెద్దాడ విజయలక్ష్మి గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమె ఆరోగ్య స్థితిని, ఆర్థిక పరిస్థితిని కూటమి నాయకుల ద్వారా తెలుసుకున్న మంత్రి సుభాష్ తక్షణం స్పందించి రూ.15 వేలు చెక్కు రూపంలో అందించారు. మెరుగైన వైద్య సేవలు పొంది త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రస్తుత అధిక ఉష్ణోగ్రతల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలంతా ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండి, ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని కోరారు. తన కష్టం తెలుసుకొని తక్షణ సాయం చేసి, భరోసా కల్పించిన మంత్రి సుభాష్ కు విజయలక్ష్మితో పాటు కూటమి నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. మంత్రి సుభాష్ వెంట ద్రాక్షారామం సర్పంచ్ కొత్తపల్లి అరుణ, పలువురు నాయకులు ఉన్నారు.

## క్యాంపస్ సెలక్షన్స్‌లో ఆదిత్య విద్యార్థులకు ఉద్యోగాలు





**రాజమహేంద్రవరం, జూన్ 6 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** సాఫ్ట్వేర్ కంపెనీలు ఇటీవల ప్రకటించిన ఫలితాలలో రాజమండ్రి ఆదిత్య డిగ్రీ కళాశాలలు నుండి 171మంది విద్యార్థిని విద్యార్థులు ప్రముఖ కంపెనీలలో సాఫ్ట్వేర్ ఉద్యోగాలకు ఎంపిక కావడం ఆనందదాయకం. అత్యుత్తమ అధ్యాపకులు అందించిన నిరంతర శిక్షణ ప్రతి విద్యార్థిపై కళాశాలలో చేరిన మొదటి రోజు నుంచి ఆదిత్య విద్యాసంస్థ ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకొని సాఫ్ట్ స్కిల్స్, ఉద్యోగాలు సాధించడంలో తీసుకోవలసిన మెలకువలు, సమయపాలన, గ్రూప్ డిస్కషన్ ఇంటర్వ్యూలో హుందాగా ప్రవర్తించడం సునీత పరిజ్ఞానంతో సమాధానం చెప్పేలా తర్ఫీదు ఇవ్వడం ద్వారా ఐటీ రంగంలో టిసిఎస్ కంపెనీకి 122 మంది కాగ్నిజెంట్ కంపెనీకి 49 మంది రాజమండ్రి ఆదిత్య విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. ఎప్పటిలాగే ఈ సంవత్సరం కూడా ఆదిత్య విద్యా సంస్థల కృషి ఫలించిందని, పొందిన శిక్షణను పూర్తిగా వినియోగించుకుని విజయం సాధించిన విద్యార్థిని, విద్యార్థులను, తల్లిదండ్రులు ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డా.ఎన్ శేషారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. నిరంతరం శ్రమించి విద్యార్థులను ఉద్యోగులుగా తీర్చిదిద్దిన అధ్యాపక బృందాన్నిఅభినందించారు. ప్రస్తుతం ప్రతి విద్యార్థి రెండు అంతకుమించి ఉద్యోగాలకు క్యాంపస్ సెలక్షన్ ద్వారా ఎంపిక కాపాడుతున్నారని మరిన్ని కంపెనీలు శిక్షణ పొందిన విద్యార్థులను వెతుక్కుంటూ ఆదిత్య సంస్థకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు.ఆదిత్య కళాశాలల సెక్రటరీ డాక్టర్ ఎన్ సుగుణ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు విజయాలు సాధించిన విద్యార్థులను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ డా. బి ఇ వి ఎల్నాయుడు, రాజమండ్రి ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ ఫణి కుమార్ ఆదిత్య మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ ఎన్ కె రెహ్మాన్ ఉద్యోగాలు సాధించినవిద్యార్థిని విద్యార్థులను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## నేడు కడియం నర్సరీలో పర్యాటక యోగాంధ్ర కార్యక్రమం

### -పర్యాటక అభివృద్ధి పనులు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన లు చేపట్టాలి -జిల్లా కలెక్టర్ పీ ప్రశాంతి



**రాజమహేంద్రవరం,జూన్ 6(తెలుగు రాష్ట్రం విలేకరి):** అఖండ గోదావరి ప్రాజెక్టు ఏర్పాటు చేసే క్రమంలో నిర్వహణా సామర్థ్యం పై కూడా సమాంతరంగా దృష్టి పెట్టాల్సి అవసరం ఉందని జిల్లా కలెక్టర్ పీ ప్రశాంతి సూచించారు. గురువారం సాయంత్రం స్థానిక కలెక్టర్ ఛాంబర్ లో పర్యాటక, ఇతర సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పీ ప్రశాంతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో పర్యటనా ప్రాంతాలు అభివృద్ధి చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అఖండ గోదావరి జిల్లాను మంజూరు చేయడం, తద్వారా రాజమండ్రి గోదావరి పుష్కర్ ఘాట్లను, హెవలాక్ వంతెన, కడియపు లంక ప్రాంతాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి వాటిని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకుని రావడంపై దృష్టి పెట్టాల్సి ఉందన్నారు. ఆయా ప్రాజెక్టుల ఏర్పాటుతో భవిష్యత్తులో వాటి నిర్వహణ, ఆపరేషన్ సమాంతరంగా చేపట్టాల్సి ఉందన్నారు. శిల్పారామం తరహాలో దశలు వారీగా రివర్ ఫ్రంటును పర్యటనకు అనువైనదిగా, ఆకర్షణ ప్రాంతంగా అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. ఇప్పటికే ప్రతిపాదించిన పనులు చేపట్టడం, పూర్తి చేసిన వాటిని ప్రారంభించుకునే క్రమంలో సమగ్ర నివేదిక అంద చెయ్యాలని జిల్లా కలెక్టర్ పీ ప్రశాంతి ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న, ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ యోగాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగా జిల్లాలో నాలుగు పర్యాటక ప్రదేశాల్లో యోగాంధ్ర కార్యక్రమాన్ని జూన్ 7 న కడియపులంక సత్యదేవ నర్సరీ పుల్లా చంటయ్య నర్సరీ లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కడియం నర్సరీ రైతులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పర్యాటక అధికారి పీ వెంకటాచలం, ఏపీ ఎంఐపీపీడీ ఏ దుర్గేష్, టూరిజం అధికారులు, కాంట్రాక్టు ఏజెన్సీస్ ప్రతినిధులు, సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పోషకాహారంతో ఆరోగ్యం-ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం,జూన్ 6(తెలుగు రాష్ట్రం విలేకరి):** పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకుంటే మనం ఆరోగ్యంగా ఉంటామని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. స్థానిక దానవాయిపేట పెట్రోల్ బంక్ పక్కన '9 నట్స్' పేరిట నూతనంగా ఏర్పాటు చేసిన మిల్లెట్స్ షాపు ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే వాసు ముఖ్య అతిథిగా హాజరై 9 నట్స్ నిర్వాహకులు వై సత్తియ్య నాయుడు, ఆర్సీ శేఖర్, టిఎన్టియూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రే శ్రీనివాస్, రాజమండ్రి పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు, 9 నట్స్ సృష్టికర్త కీర్తన తదితరులతో కలిసి ప్రారంభించారు.

# రిటైర్మెంట్ ప్రకటించిన రోహిత్ శర్మ

# జిగిరీ దోస్త్.. ఎందుకంటే?

భారత క్రికెట్‌లో సుదీర్ఘకాలం పాటు తనదైన ముద్ర వేసిన సీనియర్ లెగ్ స్పిన్నర్ పీయూష్ చావ్లా అన్ని ఫార్మాట్ల క్రికెట్ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. శుక్రవారం (జూన్ 6, 2025) నాడు తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా ఒక భావోద్వేగ సందేశాన్ని పంచుకుంటూ, తన రెండు దశాబ్దాలకు పైగా సాగిన క్రికెట్ ప్రయాణానికి వీడ్కోలు పలికారు. 36 ఏళ్ల చావ్లా రిటైర్మెంట్ ప్రకటించడం భారత క్రికెట్ వర్గాలలో చర్చనీయాంశంగా మారింది.



### విశేషమైన కెరీర్..

పీయూష్ చావ్లా అంతర్జాతీయ క్రికెట్‌లో పెద్దగా అవకాశాలు దక్కించుకోలేకపోయినప్పటికీ, దేశీయ క్రికెట్‌లో, ముఖ్యంగా ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో ఒక దిగ్గజ బౌలర్‌గా గుర్తింపు పొందారు. అంతర్జాతీయ కెరీర్: చావ్లా భారత జట్టు తరఫున 3 టెస్టులు, 25 వన్డేలు, 7 టీ20లు ఆడారు. ఈ ఫార్మాట్లలో మొత్తం 43 వికెట్లు పడగొట్టారు. 2007 టీ20 ప్రపంచ కప్, 2011 వన్డే ప్రపంచ కప్ గెలిచిన భారత జట్లలో సభ్యుడిగా ఉండటం ఆయన కెరీర్‌లో ఒక విశేషమైన ఘనత. ఐపీఎల్ ప్రస్థానం: పీయూష్ చావ్లా ఐపీఎల్‌లో ఘనమైన రికార్డును కలిగి ఉన్నారు. ఆరంభ సీజన్ (2008) నుంచి ఐపీఎల్ ఆడుతున్న ఆయన, పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ వంటి పలు ఫ్రాంచైజీలకు ప్రాతినిధ్యం వహించారు. 192 ఐపీఎల్ మ్యాచ్‌లలో 192 వికెట్లు తీసి, లీగ్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో ఒకరిగా నిలిచారు. 2014లో కోల్‌కతా నైట్ రైడర్స్ తరఫున ఐపీఎల్ టైటిల్ గెలిచిన జట్టులో ఆయన కీలక పాత్ర పోషించారు.

**దేశీయ క్రికెట్:** ఉత్తరప్రదేశ్‌లోని అలీఘడ్‌లో జన్మించిన చావ్లా, తన సొంత రాష్ట్రం తరఫున 2008-2013 వరకు దేశీయ క్రికెట్ ఆడారు. ప్రస్తుతం ఆయన గుజరాత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో కూడా ఆయనకు బలమైన రికార్డు ఉంది. 137 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లలో 446 వికెట్లు సాధించారు.

### భవిష్యత్ ప్రణాళికలు..

తన రిటైర్మెంట్ ప్రకటనలో, పీయూష్ చావ్లా తన కోచ్‌లకు, కుటుంబ సభ్యులకు, తన కెరీర్‌లో మద్దతుగా నిలిచిన అన్ని క్రికెట్ బోర్డులకు కృతజ్ఞతలు తెలిపారు.

మైదానం నుంచి తప్పుకున్నప్పటికీ, క్రికెట్ తనలో ఎప్పటికీ జీవించి ఉంటుందని, కొత్త ప్రయాణాన్ని ప్రారంభించడానికి ఎదురుచూస్తున్నానని ఆయన పేర్కొన్నారు.

పీయూష్ చావ్లా రిటైర్మెంట్ భారత క్రికెట్‌కు ఒక శకానికి ముగింపు పలికింది. ఆయన భవిష్యత్ ప్రణాళికలు ఏమైనప్పటికీ, భారత క్రికెట్‌కు ఆయన చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి.

# తప్పు చేసి కప్పిపుచ్చుతున్నారా!

## ఇంతకూ ఈ ఘటనకు బాధ్యులెవరు?





**యుద్ధంలో విజయం కోసం ముందుగా బలి ఇస్తారు. కాని, ఇక్కడ విజయం తరువాత బలి జరిగింది. ఓవైపు.. తొక్కిసలాట జరిగిందని తెలుసు. అప్పటికే కొందరి ప్రాణాలు పోయాయని తెలుసు. ఆస్పత్రిలో చావుబతుకుల మధ్య మరికొందరు కొట్టుమిట్టాడుతున్నారనీ తెలుసు. అయినా సరే.. విజయోత్సవ కార్యక్రమం జరిగింది. మనసుందా అసలు? సంబరాలు చేసుకోవాల్సిన సమయమా అది?**

యుద్ధంలో విజయం కోసం ముందుగా బలి ఇస్తారు. కాని, ఇక్కడ విజయం తరువాత బలి జరిగింది. అది కూడా నరబలి. ఇలాంటి పరిస్థితుల్లో అసలు వేడుక ఎలా చేసుకోవాలనిపించింది? ఓవైపు.. తొక్కిసలాట జరిగిందని తెలుసు. అప్పటికే కొందరి ప్రాణాలు పోయాయని తెలుసు. ఆస్పత్రిలో చావుబతుకుల మధ్య మరికొందరు కొట్టుమిట్టాడుతున్నారనీ తెలుసు. అయినా సరే.. విజయోత్సవ కార్యక్రమం జరిగింది. మనసుందా అసలు? సంబరాలు చేసుకోవాల్సిన సమయమా అది? చుట్టూ కోలాహలం. ఎక్కడ చూసినా సంబరాలు. ఐపీఎల్ కప్ విజయంతో ఆర్సీబీ అభిమానుల విజిల్స్, అరుపులు, డ్యాన్సులు.. భలే సరదాగా అనిపించింది దివ్యాన్షికి. ఆ చిన్నారి వయసు 13 ఏళ్లు. సహజంగానే ఆ అల్లరిని ఎంజాయ్ చేసే వయసు కదా. వాళ్లను చూస్తూ తను కూడా కేరింతలు కొట్టింది చిన్నస్వామి స్టేడియం బయట. ఏమైందో ఏమో.. ఉన్నట్టుండి ఊపిరి ఆడడం కష్టమైంది. పెదాలపై నవ్వు ఆగిపోయింది. గుండెలను నొక్కేస్తున్నారెవరో. చిట్టి చేతులతో నెడదామా అంటే.. అప్పుడే గట్టిపడుతున్న రెక్కలు కదా బలం చాల్లేదు. ఏడుపు తన్నుకొచ్చింది. ఇదివరకెప్పుడు ఎదురవని అనుభవం కదా. అసలు ఊపిరి ఆగిపోవడం అంటే ఏంటో, ఆఖరి శ్వాస తీసుకోవడం అంటే ఎలా ఉంటుందో తెలీదు కదా ఆ పాపకి. బట్.. ఒక ధైర్యం. పక్కనే అమ్మ, నాన్న, అత్త ఉన్నారని. తనకేం కాదులే అని. అరవాలనుకుంది అమ్మా, నాన్నా, అత్తా.. ప్లీజ్ ఇక ఇంటికెళ్లిపోదాం అని. కాని, ఊపిరి ఆడితేనే కదూ

# ఆర్సీబీకి షాకుల మీద షాకులు..

## తొక్కిసలాట కేసులో విరాట్ కోహ్లీ ఫ్రెండ్ అరెస్ట్.. ఎవరంటే.?

**11 మందిని బలి తీసుకున్న RCB విజయోత్సవ సంబరాల వ్యవహారం- కర్నాటక ప్రభుత్వాన్ని షేక్ చేస్తోంది. నిన్న బెంగళూరు సీపీతోపాటు మొత్తం ముగ్గురు సీనియర్ అధికారులపై వేటు వేసిన ప్రభుత్వం, ఎవ్వరినీ వదిలేది లేదని అంటోంది. అటు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ప్రతినిధిని కూడా..**



నిఖిల్ భార్య, అనుష్క శర్మ ఫ్రెండ్స్..

బెంగళూరు చిన్నస్వామి స్టేడియం తొక్కిసలాట కేసులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచైజీకి ఇబ్బందులు మొదలయ్యాయి. ఈ కేసులో ఆర్సీబీ మార్కెటింగ్ హెడ్ నిఖిల్ సొసాలే అరెస్ట్ అయ్యారు. విక్టరీ పరేడ్‌కు సంబంధించి నిఖిల్ అనధికారికంగా ప్రమోషన్స్ చేశారని, అనుమతి లేకుండా వేడుకలు నిర్వహించారని పోలీసులు ఆరోపిస్తున్నారు. ముంబైకి వెళుతుండగా బెంగళూరు కెంపెగౌడ ఎయిర్‌పోర్ట్‌లో నిఖిల్‌ను కర్ణాటక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిఖిల్‌తో పాటు DNA సిబ్బంది సునీల్ మాథ్యూ, కిరణ్, మరో వ్యక్తిని కూడా అరెస్ట్ చేశారు. కబ్బన్‌పార్క్ పోలీస్ స్టేషన్‌లో నలుగురిపై ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు.

అటు ఆర్సీబీ విజయోత్సవ వేడుక నిర్వాహకులు, కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ శంకర్, ట్రెజరర్ జైరామ్ పరారీలో ఉండగా.. వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కాగా, %=జదీ% విజయోత్సవ పరేడ్‌లో జరిగిన తొక్కిసలాటలో 11 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఆర్సీబీ ప్రమోషనల్ బ్రాండింగ్‌లో నిఖిల్ కీలక పాత్ర వ్యవహరిస్తున్నాడు. నివేదికల ప్రకారం.. 2008 నుంచి నిఖిల్ ఆర్సీబీతో ఉన్నాడు.

ఐపీఎల్ 2025లో ఆర్సీబీ ఆడిన ప్రతీ మ్యాచ్‌లోనూ అనుష్క శర్మతో పాటు కనిపించిన ఓ మహిళ మీకు గుర్తుందా.? ఆమె మరెవరో కాదు.. నిఖిల్ సొసాలే భార్య మాళవిక నాయక్. నిఖిల్‌లాగే.. ఆమె వ్యాపార అభివృద్ధిలో పాత్ర పోషించడమే కాకుండా.. వ్యాపార భాగస్వామిగా కీ

# కరుణ్‌నాయర్ అనుభవం టీమ్‌ఇండియాకు ఉపయోగం: గౌతమ్ గంభీర్

దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణించి, చాలా సంవత్సరాల తర్వాత టీమ్‌ఇండియాలోకి పునరాగమనం చేసిన కరుణ్ నాయర్‌ను ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ప్రశంసించాడు. ఇంగ్లండ్ టూర్‌లో కరుణ్ అనుభవం జట్టుకు ఎంతో ఉపయోగపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశాడు.

దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణించి, చాలా సంవత్సరాల తర్వాత టీమ్‌ఇండియాలోకి పునరాగమనం చేసిన కరుణ్ నాయర్‌ను ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ప్రశంసించాడు. ఇంగ్లండ్ టూర్‌లో కరుణ్ అనుభవం జట్టుకు ఎంతో ఉపయోగపడుతుందని విశ్వాసం వ్యక్తంచేశాడు. భారత్, ఇంగ్లండ్ టూర్‌కు బయలుదేరనున్న నేపథ్యంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో గౌతమ్ గంభీర్ మాట్లాడారు. కరుణ్ నాయర్ ఇంతకుముందు చివరిసారిగా 2017లో టీమ్‌ఇండియా తరఫున అంతర్జాతీయ టెస్ట్ మ్యాచ్ ఆడాడు. దేశవాళీల్లో రాణించడంతో అతన్ని ప్రస్తుతం ఇంగ్లండ్ పర్యటనకు సెలక్టర్లు ఎంపిక చేశారు. ఇందులోభాగంగా ఇటీవల ఇంగ్లండ్ లయన్స్‌తో జరిగిన అనధికారిక మొదటి టెస్ట్ మ్యాచ్‌లో ఈ సీనియర్ బ్యాటర్ డబుల్ సెంచరీ సాధించాడు.

### 'తలుపులు తెరిచే ఉంటాయి'

'కరుణ్ నాయర్ అనుభవం టీమ్‌ఇండియాకు ఎంతో మేలు చేస్తుంది. అతడు ఇంతకుముందు ఇంగ్లండ్‌లో కౌంటీ క్రికెట్ ఆడాడు. అక్కడి పరిస్థితుల మీద కరుణ్‌కు అవగాహన ఉంది. అందుకే ఈ టూర్‌లో అతడు కీలకం కానున్నాడు. నేను యువ క్రికెటర్లకు ఒకటే చెబుతున్నా.. మీరు మీ అత్యున్నత ప్రదర్శన ఇస్తున్నన్ని రోజులు మీకోసం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. మరో ముఖ్యమైన విషయం ఏంటంటే.. మేం కేవలం ఒకటి, రెండు టెస్టు మ్యాచ్‌ల్లో ప్రదర్శన చూసి వారి మీద ఓ అభిప్రాయానికి రాము. నిలకడగా పరుగులు సాధిస్తేనే, అంతర్జాతీయ క్రికెట్‌లో రాణించగలరు' అని గౌతమ్ గంభీర్ అన్నాడు.

### దేశవాళీల్లో కరుణ్ ప్రదర్శన ఇదీ..

రంజీ ట్రోఫీలో విదర్భ తరఫున కరుణ్‌నాయర్ ఈ సీజన్‌లో దుమ్ము రేపాడు. 53.93 యావరేజ్‌తో తొమ్మిది మ్యాచుల్లో 16 ఇన్నింగ్స్‌ల్లో 863 పరుగులు చేశాడు. ఇందులో నాలుగు సెంచరీలు, రెండు హాఫ్ సెంచరీలున్నాయి. ఫైనల్‌లో 135 పరుగులు చేసి, జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. విజయ్ హజారే ట్రోఫీలోనూ కరుణ్ నాయర్ మెరుగైన ప్రదర్శన చేశాడు. తొమ్మిది మ్యాచ్‌లు, ఎనిమిది ఇన్నింగ్స్‌ల్లో ఏకంగా 389.50 యావరేజ్, 124.04 స్ట్రైక్‌రేట్‌తో 779 పరుగులు చేశాడు. ఇందులో అయిదు శతకాలు, ఒక అర్ధ శతకం ఉంది. 163లి అత్యధిక స్కోరు. అలాగే సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ (టీ20)లో 42.50 యావరేజ్, 177.08 స్ట్రైక్ రేట్‌తో ఆరు ఇన్నింగ్స్‌ల్లో 255 పరుగులు చేశాడు. ఇందులో మూడు అర్ధ శతకాలున్నాయి. 77లి అత్యధిక స్కోరు. ఈ ప్రదర్శనల ఆధారంగానే దాదాపు ఎనిమిదేళ్ల విరామం తర్వాత కరుణ్ నాయర్ తిరిగి భారత టెస్టు జట్టులో స్థానం సంపాదించుకున్నాడు. దీన్ని సుస్థిరం చేసుకోవడమే ప్రస్తుతం అతడి ముందున్న కర్తవ్యం!

# తొక్కిసలాటపై కర్ణాటక సర్కార్ సీరియస్..

## బెంగళూరు CP సహా పలువురు అధికారుల సస్పెన్షన్!


**ఆర్సీబీ విజయోత్సవాల సందర్భంగా.. బెంగళూరు చిన్నస్వామి స్టేడియం దగ్గర చోటుచేసుకున్న విషాద ఘటనపై చర్యలు ప్రారంభించింది కర్నాటక ప్రభుత్వం. తొక్కిసలాటలో.. 11మంది చనిపోవడాన్ని సీరియస్‌గా తీసుకుంది సిద్దరామయ్య సర్కార్. బెంగళూరు పోలీస్ కమిషనర్‌తో పాటు తొక్కిసలాటతో సంబంధం ఉన్న ఇతర పోలీస్ ఉన్నతాధికారులపై సస్పెన్షన్ వేటు పడింది.**

బెంగళూరు తొక్కిసలాట విషయాన్ని సీరియస్‌గా తీసుకుంది కర్నాటక ప్రభుత్వం. కేబినెట్‌లో చర్చించి.. కీలక ఆదేశాలు ఇచ్చారు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య. పోలీస్ శాఖలో గతంలో ఎన్నడూ లేనన్ని సస్పెన్షన్లు, అరెస్ట్‌లకు ఆర్డర్లు ఇచ్చారు. ఆర్సీబీ విజయోత్సవాల సందర్భంగా.. బెంగళూరు చిన్నస్వామి స్టేడియం దగ్గర చోటుచేసుకున్న విషాద ఘటనపై చర్యలు ప్రారంభించింది కర్నాటక ప్రభుత్వం. తొక్కిసలాటలో.. 11మంది చనిపోవడాన్ని సీరియస్‌గా తీసుకుంది సిద్ధరామయ్య సర్కార్. బెంగళూరు పోలీస్ కమిషనర్‌తో పాటు తొక్కిసలాటతో సంబంధం ఉన్న ఇతర పోలీస్ ఉన్నతాధికారులపై సస్పెన్షన్ వేటు పడింది. సస్పెండ్ అయిన వారిలో.. సీపీ దయానందతో పాటు అడిషనల్ సీపీ, డీసీపీ, కబ్బన్ పార్క్ పోలీస్ స్టేషన్ సీఐ, ఎస్ఐ, క్రికెట్ స్టేడియం పోలీస్ ఇన్‌ఛార్జి ఉన్నారు. సస్పెన్షనే కాదు.. ఆర్సీబీ ప్రతినిధులు, డీఎన్ఏ ఈవెంట్ మేనేజర్స్, కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులను తక్షణమే అరెస్టు చేయాలని డీజీపీ, ఐజీపీని ఆదేశించారు సీఎం. అడిషనల్ డీజీపీగా ఉన్న సీమంత్ కుమార్ సింగ్‌ను బెంగళూరు కొత్త సీపీగా అపాయింట్ చేశారు. హైకోర్టు రిటైర్డ్ జడ్జి అధ్యక్షతన జ్యుడీషియల్ ఎంక్వైరీకి ఆదేశించి.. 30 రోజుల్లో నివేదిక ఇవ్వాలని డెడ్‌లైన్ పెట్టారు సీఎం సిద్ధరామయ్య. తొక్కిసలాటపై.. సమాచార హక్కు కార్యకర్త స్నేహమయి కృష్ణ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు ఎఫ్ఐఆర్‌లో.. ఏ1గా ఆర్సీబీ, ఏ2గా DNA మేనేజ్‌మెంట్, ఏ3గా కర్నాటక క్రికెట్ అసోసియేషన్‌ను చేర్చారు. నేరపూరిత నిర్లక్ష్యంగా పేర్కొంటూ పలు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మరోవైపు.. తొక్కిసలాట ఘటన బాధాకరమంటూ భావోద్వేగానికి లోనయ్యారు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్. అనుకోకుండా జరిగిన ఘటనలో ఎవ్వరినీ తాము బ్లేమ్ చేయకున్నా, ప్రతిపక్షాలు శవరాజకీయాలు చేస్తున్నాయంటూ మండిపడ్డారు. విక్టరీ పరేడ్ విషాదంగా మారడంతో చనిపోయిన వారికి ఆర్సీబీ యాజమాన్యం పరిహారం ప్రకటించినా.. ప్రభుత్వం చర్యలు మాత్రం ఆగలేదు. ని

అనుకోకుండా జరిగినా.. విషాద ఘటనకు బాధ్యత వహించాల్సిందే అంటోంది సిద్ద సర్కార్. ఈ నెల 10వ తేదీన హైకోర్టులో విచారణ తర్వాత.. తొక్కిసలాటపై ఇంకెన్ని చర్యలు ఉంటాయో చూడాలి..!

తెలుగురాష్ట్రం దినపత్రిక

# ఘనంగా అక్కినేని అఖిల్ పెండ్లి


హీరో అక్కినేని నాగార్జున రెండో కుమారుడు, నటుడు అఖిల్ వైవాహిక బంధంలోకి అడుగుపెట్టాడు. తన ప్రియురాలు జైనబ్ రవ్జీ మెడలో మూడు ముళ్లు వేశారు. జూబ్లీహిల్స్‌లోని నాగార్జున ఇంటిలో శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటలకు వీరి వివాహం ఘనంగా జరిగింది. ఇరు కుటుంబాలతో పాటు అత్యంత దగ్గరి సన్నిహితులు, స్నేహితుల సమక్షంలోనే వీరి వివాహం జరిగింది. ఇక వీరి వివాహ మహోత్సవానికి మెగాస్టార్ చిరంజీవి దంపతులు, రామ్‌చరణ్–ఉపాసన దంపతులు, దర్శకుడు ప్రశాంత్ నీల్ తదితరులు హాజరై కొత్త జంటను ఆశీర్వదించారు. అనంతరం పెళ్లి బరాత్ నిర్వహించగా.. నాగార్జున, నాగచైతన్య తదితరులు డ్యాన్స్ చేస్తూ సందడి చేశారు. ఇందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ఫోటో క్లిక్





# రాముడి పాత్ర కోసం రణ్‌బీర్ కపూర్ కొత్త లుక్

తాజాగారణ్‌బీర్ కపూర్పూర్తిగా క్లీన్ షేవ్ లుక్‌లో దర్శనమిచ్చాడు. ఈ లుక్ రాముడి పాత్రకు అనుగుణంగా ఉండేలా డిజైన్ చేయబడి ఉంది.

# అయోమయంలో నాగ్ అశ్విన్



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన కల్కి 2898ఏడి సినిమా ప్రభాస్ తో పాటూ బాక్సాఫీస్ కు కూడా ఎంతో ఉపశమనాన్ని కలిగించింది. అయోమయంలో నాగ్ అశ్విన్ పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన కల్కి 2898ఏడి సినిమా ప్రభాస్ తో పాటూ బాక్సాఫీస్ కు కూడా ఎంతో ఉపశమనాన్ని కలిగించింది. కల్కి సినిమా ప్రపంచ వ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద భారీగా కలెక్షన్లను రాబట్టుకుంది. అమితాబ్ బచ్చన్, దీపికా పదుకొణె, కమల్ హాసన్ లాంటి స్టార్ క్యాస్టింగ్ తో వచ్చిన ఈ సినిమా అన్ని భాషల్లో విపరీతంగా సక్సెస్ అయింది. అయితే కల్కి పెద్ద కథ కావడంతో దీన్ని ఒక సినిమాలో చెప్పలేకపోయిన డైరెక్టర్ నాగ్ అశ్విన్ కల్కిని రెండు భాగాలుగా విభజించాడు. కల్కి మొదటి భాగం మంచి సక్సెస్ అవడంతో కల్కి సీక్వెల్ పై ఇప్పుడు అందరికీ అంచనాలు తారా స్థాయిలో ఉన్నాయి. అందులో భాగంగానే కల్కి2 స్క్రిప్ట్ ను ఎంతో జాగ్రత్తగా రెడీ చేస్తున్నాడు నాగ్ అశ్విన్. వాస్తవానికి కల్కి సీక్వెల్ ను ఈ ఇయర్ లో మొదలు పెట్టాలని నాగ్ అశ్విన్ ముందుగా ప్లాన్ చేసుకున్నాడు కానీ ప్రభాస్ ప్రస్తుతం పలు ప్రాజెక్టులతో బిజీగా ఉండటం వల్ల కల్కి సీక్వెల్ వాయిదా పడింది. సినిమాను ఈ ఇయర్ సెట్స్ పైకి తీసుకెళ్లాలనే ఆలోచనతో నాగ్ అశ్విన్ దానికి అనుగుణంగా అందులో కీలక పాత్రలు చేయనున్న అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొణె డేట్స్ ను అడగ్గా, వారు కూడా తమ డేట్స్ ను కేటాయించారు. అయితే అందరూ తమ డేట్స్ ను కేటాయించినప్పటికీ కల్కి లో మెయిన్ లీడ్ అయిన ప్రభాస్ మాత్రం నాగ్ అశ్విన్ కు ఇంకా డేట్స్ ఇవ్వలేదు. ప్రభాస్ కల్కి2 సెట్స్ లో జాయిన్ అవాలంటే దాని కంటే ముందే తన చేతిలో ఉన్న సినిమాలన్నింటినీ పూర్తి చేయాల్సి ఉంది. ది రాజా సాబ్, ఫౌజీ సినిమాలు సెట్స్ పై ఉన్నాయి. వీటితో పాటూ స్పిరిట్ సినిమాను కూడా ప్రభాస్ ఫినిష్ చేయాలి. ప్రభాస్ కు మధ్యలో గాయం అవకుండా ఉంటే అన్నీ అనుకున్నట్టే జరిగేవి. కానీ ప్రభాస్ మధ్యలో రెస్ట్ తీసుకోవడంతో అన్ని సినిమాల షఉటింగ్ కు బ్రేక్ పడింది. ఈ పరిస్థితులన్నీ చూసి అయోమయంలో పడ్డ నాగ్ అశ్విన్, ప్రస్తుతానికి కల్కి సీక్వెల్ ప్లాన్స్ ను హెూల్డ్ లో పెట్టి మరో రెండు కొత్త స్క్రిప్ట్స్ పై వర్క్ చేస్తున్నాడని తెలుస్తోంది. కల్కి2 కోసం ప్రభాస్ ఎప్పుడైతే బల్క్ లో డేట్స్ కేటాయిస్తాడో అప్పుడే కమల్, అమితాబ్, దీపికాల డేట్స్ ను కూడా అడిగి అంతా ఓకే అనుకున్న తర్వాత సెట్స్ పైకి తీసుకెళ్లనున్నాడు.

# బిగ్‌బాస్ బ్యూటీ ఎంగేజ్డ్



తెలుగు బిగ్ బాస్ ద్వారా బుల్లి తెర ప్రేక్షకులకు సుపరిచితం అయిన ముద్దుగుమ్మ శుభశ్రీ. ఈమె తెలుగు సినిమాల్లో నటించిన పెద్దగా గుర్తింపు రాలేదు బిగ్‌బాస్ బ్యూటీ ఎంగేజ్డ్ తెలుగు బిగ్ బాస్ ద్వారా బుల్లి తెర ప్రేక్షకులకు సుపరిచితం అయిన ముద్దుగుమ్మ శుభశ్రీ. ఈమె తెలుగు సినిమాల్లో నటించిన పెద్దగా గుర్తింపు రాలేదు. తెలుగుతో పాటు తమిళ్ ఇతర భాషల్లోనూ ఈ అమ్మడు నటించిన విషయం తెల్సిందే. కానీ ఆ సినిమాలు ఏవీ ఈమెకు గుర్తింపు తెచ్చి పెట్టలేదు. కానీ ఈమెకు తెలుగులో బిగ్ బాస్ ద్వారా లభించిన గుర్తింపు అంతా ఇంతా కాదు. కేవలం బిగ్ బాస్ వల్లే సోషల్ మీడియాలో ఈమెకు ఫాలోవర్స్ లక్షల్లో పెరిగారు. అంతే కాకుండా బిగ్ బాస్ తర్వాత చాలా సినిమాల్లో ఈ అమ్మడికి నటించే అవకాశాలు దక్కాయి. అంతే కాకుండా బుల్లి తెరపై రెగ్యులర్‌గా కనిపించే అవకాశం దక్కించుకుంది. తెలుగు నటి కాకున్నా కూడా ఇక్కడ చాలా కాలంగా కొనసాగుతున్న శుభ శ్రీ కొత్త జీవితంలో అడుగు పెట్టింది. ఒడిశాకు చెందిన ఈ అమ్మడు తన జీవితంలో కీలకమైన అడుగు వేయడంతో అందరి దృష్టిని ఆకర్షించింది. సోషల్ మీడియా ద్వారా ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా రెగ్యులర్‌గా అభిమానులను అలరిస్తూ వస్తున్న శుభశ్రీ తాజాగా తన వివాహ నిశ్చితార్థ ఫోటోలను షేర్ చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. ఎట్టకేలకు నేను నా కొత్త జీవితాన్ని ప్రారంభించేందుకు సిద్ధం అవుతున్నాను అంటూ ప్రకటించింది. తాజాగా శుభశ్రీ తన నిశ్చితార్థ ఫోటోలను షేర్ చేయడం ద్వారా పెళ్లి చేసుకోబోతున్నట్లు అధికారికంగా ప్రకటించింది. చాలా రోజులుగా శుభశ్రీ ప్రేమలో ఉంది. ఆ విషయాన్ని కొద్ది మందితో షేర్ చేసుకున్న ఈమె మీడియా కు మాత్రం తెలియకుండా ఉంచింది. అప్పుడప్పుడు శుభశ్రీ వెంట కనిపించినప్పటీ అనుమానం రాకుండా జాగ్రత్త పడింది. శుభశ్రీ ఇండస్ట్రీలో పెద్దగా గుర్తింపు దక్కించుకోలేదు. కానీ నటిగా చాలా సినిమాల్లో ఆమె నటించింది. ప్రాముఖ్యత లేని పాత్రల్లో నటిస్తూ వస్తున్న ఈమె నిర్మాత అజయ్ మైసూర్‌ను వివాహం చేసుకోబోతుంది. వీరిద్దరు చాలా కాలంగా ప్రేమలో ఉన్నారట. వీరిద్దరి ప్రేమకు ఇరు కుటుంబాల వారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దాంతో తాజాగా వివాహ నిశ్చితార్థం జరిగింది. ఇదే ఏడాదిలో వీరి వివాహం వైభవంగా జరగబోతుంది. ఏ సినిమా కోసమంటే వివాహ నిశ్చితార్థంకు సంబంధించిన ఫోటోలను షేర్ చేయడంతో పాటు, ఎట్టకేలకు మా నిశ్చితార్థం జరిగిందని సోషల్ మీడియా ద్వారా చెప్పడంతో శుభశ్రీ అందరికీ తన పెళ్లి విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. అంతే కాకుండా తనకు కాబోయే భర్తను సైతం పరిచయం చేసింది. సోషల్ మీడియాలో ప్రస్తుతం శుభశ్రీ ఫోటోలు, వీడియోలు వైరల్ అవుతున్నాయి. నిర్మాతగా అజయ్ మైసూర్ పలు ప్రాజెక్టలను చేశాడట. ముందు ముందు శుభశ్రీ హీరోయిన్‌గా అజయ్ మైసూర్ ఒక సినిమాను తీస్తాడేమో చూడాలి. శుభశ్రీ రాయగురు బిగ్ బాస్ సీజన్ 7 లో ఉన్నది కొన్ని వారాలే అయినా కూడా ప్రేక్షకులకు సుపరిచితురాలు గా నిలిచింది. అందుకే ఈమె వివాహ నిశ్చితార్థం ఫోటోలు వైరల్ అవుతున్నాయి.



# మెగా ఫ్యాన్స్ డిమాండ్ లో న్యాయముంది

గత కొన్ని సినిమాలుగా మెగాస్టార్ చిరంజీవి వరుస ఫ్లాపుల్లో ఉన్నాడు. భోళా శంకర్ డిజాస్టర్ తర్వాత చిరంజీవి ఎంతో ఆచితూచి మరీ తన తర్వాతి సినిమాను బింబిసార ఫేమ్ వశిష్ట దర్శకత్వంలో చేయనున్నట్టు అనౌన్స్ చేశాడు. మెగా ఫ్యాన్స్ డిమాండ్ లో న్యాయముంది గత కొన్ని సినిమాలుగా మెగాస్టార్ చిరంజీవి వరుస ఫ్లాపుల్లో ఉన్నాడు. భోళా శంకర్ డిజాస్టర్ తర్వాత చిరంజీవి ఎంతో ఆచితూచి మరీ తన తర్వాతి సినిమాను బింబిసార ఫేమ్ వశిష్ట దర్శకత్వంలో చేయనున్నట్టు అనౌన్స్ చేశాడు. అనౌన్స్‌మెంట్ తోనే విశ్వంభర సినిమా భారీ హైప్ ను క్రియేట్ చేసుకోవడంతో పాటూ మంచి అంచనాలను కూడా ఏర్పరచుకుంది. చిరంజీవి నుంచి చాలా కాలం తర్వాత వస్తున్న సోషియో ఫాంటసీ సినిమా అని మెగా ఫ్యాన్స్ విశ్వంభర విషయంలో ఎంతో ఆశ పడ్డారు. వాస్తవానికైతే విశ్వంభర ఈ ఏడాది సంక్రాంతికే రిలీజవాల్సింది. కానీ గేమ్ ఛేంజర్ అప్పటికే పలుమార్లు వాయిదా పడటంతో ఆ సినిమా కోసం విశ్వంభర సినిమాను వాయిదా వేశారు. ఆ తర్వాత మే 9న వస్తుందన్నారు. దీంతో అసలు విశ్వంభర సినిమా ఎప్పుడు రిలీజవుతుందా అనేది టాలీవుడ్ లో పెద్ద ప్రశ్నగా మారింది. మంచి హైప్ తో మొదలైన ఈ సినిమా ఇప్పటికీ రిలీజ్ డేట్ విషయంలో క్లారిటీ ఇవ్వకపోవడం ఫ్యాన్స్ ను తీవ్రంగా నిరాశపరుస్తుంది. ఈ విషయం ఫ్యాన్స్ ను తీవ్రంగా కలవరపెడుతుంది. దానికి కారణం మేకర్స్ ఇప్పటికీ విశ్వంభర రిలీజ్ డేట్ విషయంలో క్లారిటీ ఇవ్వకపోవడమే. ఈ నేపథ్యంలోనే మెగా ఫ్యాన్స్ సోషల్ మీడియాలో విశ్వంభర అప్డేట్స్ కోసం మేకర్స్ ను డిమాండ్ చేస్తున్నారు. త్రిష హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాకు కీరవాణి సంగీతం అందిస్తుండగా, యూవీ క్రియేషన్స్ ఈ సినిమాను భారీ బడ్జెట్ తో నిర్మిస్తోంది. విశ్వంభర ఓ గొప్ప విజువల్ స్పెక్టాక్యులర్ గా నిలుస్తుందని అందరూ భావిస్తున్నారు. మరి ఈ సినిమా అయినా చిరంజీవిని హిట్ ట్రాక్ ఎక్కిస్తుందేమో చూడాలి. ఏదేమైనా ఎంతో కాలంగా ఈ సినిమా కోసం వెయిట్ చేస్తున్న మెగా ఫ్యాన్స్ సోషల్ మీడియాలో చేస్తున్న ఈ డిమాండ్లలో న్యాయముంది.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339